# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:88 శుక్రవారం 19 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య

**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**



కర్ణాటక ముఖ్యమంత్రి ఎవరన్న ఉత్కంఠకు తెరపడింది. బెంగళూరులో సుదీర్ఘ చర్చల తరవాత హైకమాండ్ సిద్దరామయ్యనే ముఖ్యమంత్రిగా ప్రకటించింది. డీకే శివకుమార్ కూడా రేసులో ఉన్నప్పటికీ...సీనియర్ నేత అన్న గౌరవంతో ఆయనకే ఆ పదవి కట్టబెట్టింది. ఆయనకు డిప్యుటీ సీఎం పదవి అప్పగించింది. అన్ని విధాలుగా ఆలోచించిన తరవాతే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేసింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఈ విషయం వెల్లడించారు. డీకే శివకుమార్ పార్టీ కోసం చేసిన కృషిని అభినందించింది. శివకుమార్, సిద్దరామయ్యలో ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో చాలా చర్చలు జరిగాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో సంప్రదింపులు జరిపిన తరవాత సిద్దరామయ్యను ఎంపిక చేశారు. శివకుమార్‌ని పీసీసీ ప్రెసిడెంట్‌గా కూడా నియమించింది. 2024లో లోక్‌సభ ఎన్నికలు ముగిసేంత వరకూ ఆయనే ప్రెసిడెంట్‌గా కొనసాగుతారని వేణుగోపాల్ స్పష్టం చేశారు. మే 20న ముఖ్యమంత్రి, ఉప

02

## జల్లి కట్టు నిషేధించలేం



**ప్రజా తపన ,చెన్నై :**

జల్లికట్టు వేడుకలు జరుపుకునేందుకు తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా చట్టం చేయడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ ఆటను నిషేధించాలన్న పిటిషన్‌లను తిరస్కరించింది. సంప్రదాయ క్రీడలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరవాత...మళ్లీ అందులో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం సరికాదని వెల్లడించింది. "జల్లికట్టు క్రీడపై తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసింది. అధికారికంగా జరుపుకునేందుకు అనుమతినిచ్చింది. ఇది సంప్రదాయ క్రీడ. అలాంటప్పుడు న్యాయవ్యవస్థ

02



## ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4 శాతం డీఏ పెంపు

**ప్రజా తపన ,చెన్నై :**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురందించింది. వారికి 4 శాతం డీఏ పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ డీఏ పెంపు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు, కుటుంబ పింఛన్‌దారులు లబ్ధిపొందుతారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం పెంచినప్పుడల్లా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా పెంచడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మార్చిలో కేంద్రప్రభుత్వం తన ఉద్యోగులకు నాలుగు శాతం కరవు భత్యాన్ని పెంచింది. ఆ కరవు భత్యం పెంపు గత జనవరి ఒకటి నుంచే వర్తిస్తుందని స్పష్టం

02

## మోదీ మంత్రివర్గంలో స్వల్ప మార్పులు

### భూగోళ శాస్త్రాల మంత్రిత్వ శాఖ మంత్రిగా కిరణ్ రిజిజు

### అర్జున్ రామ్ మేఘవాల్‌కు న్యాయ శాఖ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంత్రివర్గంలో స్వల్ప మార్పులు జరిగాయి. న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ను ఆ పదవి నుంచి తొలగించి, ఆయనకు భూగోళ శాస్త్రాల మంత్రిత్వ శాఖను అప్పగించారు. న్యాయ శాఖను అర్జున్ రామ్ మేఘవాల్‌కు అప్పగించారు. మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీనికి సంబంధించిన ఆదేశాలను జారీ చేశారు.

02





## 26న ఢిల్లీకి సీఎం జగన్

**ప్రజా తపన ,విజయవాడ:**

ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ ఈనెల 27న జరగబోయే నీతి ఆయోగ్ కీలక సమావేశానికి సీఎం జగన్ హాజరు కానున్నారు. సీఎం జగన్ నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ప్రధాని మోడీ, హోం శాఖా మంత్రి అమిత్ షాలతో ప్రత్యేకంగా

02

## ఆర్ 5 జోన్ లో పట్టాలు



**ప్రజా తపన ,విజయవాడ:**

ఏపీలోని అమరావతి ప్రాంతంలోని ఖీ-5 జోన్‌లో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వొచ్చంటూ ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో జగన్ సర్కార్ ఆ దిశగా

02

## టిడ్కో ఇళ్లు మీ ఆస్తి..వదులుకోవద్దు

### నారా చంద్రబాబు నాయడు

**ప్రజా తపన ,పెందుర్తి**



టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయడు గురువారం పెందుర్తిలో టిడ్కో ఇళ్ల లబ్దిదారులతో సమావేశం అయ్యారు. తెలుగు దేశం హయాంలో సకల వసతులతో నిర్మించిన ఇళ్లను ఇప్పటికీ తమకు కేటాయించకపోవడంపై లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ 1983లో ఎన్టీ రామారావు పక్కా ఇళ్ల నిర్మాణాలను

02

prajathapana.com

# కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రితో పాటు కొందరు మంత్రులు ప్రమాణస్వీకారం చేస్తారని వెల్లడించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తమ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండే ప్రతి పార్టీనీ ఆహ్వానిస్తామని తెలిపారు. దాదాపు నాలుగు రోజులుగా ఈ సస్పెన్స్ కొనసాగింది. డీకే శివకుమార్, సిద్ధరామయ్య ఇద్దరూ రేసులో ఉండటం, ఇద్దరూ కీలక నేతలే కావడం వల్ల హైకమాండ్‌కి ఇంత టైమ్ పట్టింది. వరుస భేటీలతో వాళ్లకు పరిస్థితులను వివరించింది. కర్ణాటక భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరింది. ఆ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోనూ చర్చలు జరిగాయి. చివరి వరకూ సీఎం కుర్చీ కావాలని పట్టుపట్టిన డీకే శివకుమార్...చివరకు త్యాగం చేశారు. హైకమాండ్ మాటకే తలొగ్గారు. కీలక మంత్రిత్వ శాఖలు ఇస్తానన్నా ముందు మొండికేసిన ఆయన...సోనియాతో మాట్లాడిన తరవాత వెనక్కి తగ్గారు. చివరి నిముషం వరకూ ఉత్కంఠగా సాగిన చర్చలు...సోనియా ఎంట్రీతో కాస్త సద్దుమణిగాయి. రాహుల్, ఖర్గే ముందుండి నడిపించినా..సోనియా గాంధీ వెనకాల ఉండి దారి చూపించారు. లేకపోతే...ఈ సస్పెన్స్ ఇంకొన్నాళ్ల పాటు కొనసాగేది. త్వరలోనే కేబినెట్‌నీ డిక్లేర్ చేయనుంది హైకమాండ్

### కర్ణాటక ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత

కర్ణాటక సీఎం రేసుకి తెరపడింది. సీఎంగా సిద్ధరామయ్యను ప్రకటించింది హైకమాండ్. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ అధికారికంగా ఈ ప్రకటన చేశారు. డీకే శివకుమార్‌కి డిప్యుటీ సీఎం పదవి కట్టబెట్టారు. సీఎం కుర్చీలో కూర్చోవాలని ఆశపడ్డ ఆయనను డిప్యుటీకి పరిమితం చేసిం అధిష్ఠానం. అయితే...ఈ నిర్ణయంపై తొలిసారి డీకే స్పందించారు. తాము అంతా కలిసే ఉన్నామని, కర్ణాటక ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. సిద్ధరామయ్య, ఖర్గేతో కలిసి దిగిన ఫోటోని ట్విటర్‌లో పంచుకున్నారు."కర్ణాటక ప్రజల భవిష్యత్‌కి భరోసా ఇవ్వడం, వాళ్ల సంక్షేమానికి కట్టుబడి ఉండటం..ప్రస్తుతానికి ఇవే మా ప్రాధాన్యత. ఈ విషయంలో మేము కలిసికట్టుగా పని చేస్తామని హామీ ఇస్తున్నాను"135 మంది ఎమ్మెల్యేలను గెలిపించింది నేనే అని అంత కాన్ఫిడెంట్‌గా స్టేట్‌మెంట్ ఇచ్చిన శివకుమార్‌ను పక్కన పెడితే...కాంగ్రెస్‌కు నష్టం తప్పదేమో అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. ఇప్పటికే ఇంటి పోరుతో నలిగిపోతున్న ఆ పార్టీకి ఇది పెద్ద సవాలుగా మారింది. ఏదేమైనా...శివకుమార్‌కి సీఎం పదవి కట్టబెట్టకపోవడానికి కొన్ని ప్రధాన కారణాలున్నట్టు తెలుస్తోంది. కర్ణాటక పాలిటిక్స్‌లో ధనవంతుల లిస్ట్ తీస్తే..అందులో ముందుగా కనిపించే పేరు డీకే శివకుమార్. ఆస్తులే కాదు...అదే స్థాయిలో అవినీతి కేసులూ ఆయన పేరిట ఉన్నాయి. మనీలాండరింగ్ కేసులో అరెస్టై దాదాపు రెండు నెలల పాటు జైల్లో ఉన్నారు. సీబీఐ విచారణను సవాలు చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌ని కూడా హైకోర్టు కొట్టేసింది. పదేపదే ఈడీ విచారణకు హాజరవుతున్నారు డీకే. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని...అధిష్ఠానం శివకుమార్‌ను పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. ఈ కేసులను పట్టించుకోకుండా సీఎం పదవి ఇచ్చినా...దర్యాప్తు సంస్థలు ఆయనను పదేపదే విచారణకు పిలవడం కాస్త ఇబ్బంది కలిగించడం ఖాయం. ముఖ్యమంత్రే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటే..ఇక ప్రభుత్వంపై ప్రజలకు ఏం నమ్మకముంటుంది..? ఇదిగో ఇదే పాయింట్‌తో హైకమాండ్ సర్ది చెప్పే ప్రయత్నం చేసి ఉండొచ్చు.

సీఎం పదవికి పోటీ పడాలంటే ఎమ్మెల్యేల బలం గట్టిగా ఉండాలి. ఈ విషయంలో సిద్ధరామయ్య కన్నా వెనకబడి ఉన్నారు డీకే. ఆయనకు కేవలం 40 మంది మాత్రమే సపోర్ట్ ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేల మద్దతు ఎవరికి ఎక్కువ ఉంటే...వాళ్లకే సీఎం పదవి ఇస్తామని ఇప్పటికే రాహుల్ చాలా క్లారిటీగా చెప్పారు. ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకోవడంలో సిద్ధరామయ్య సిద్ధహస్తుడు. 2013లో ఈ వ్యూహంతోనే ఖర్గేను ఓడించారు. ఈ సారి కూడా అదే స్ట్రాటెజీ అమలు చేసి 90 మంది బలాన్ని కూడగట్టుకున్నారు. అందుకే...అధిష్ఠానం అన్ని విధాలుగా ఆలోచించి...సిద్ధరామయ్యకు పదవి అప్పగించింది.

### రైతు కుటుంబంలో పుట్టి..3వ సారి సీఎం

కర్ణాటకలో అఖండ విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును ప్రకటించింది. రాష్ట్రంలో మాస్ లీడర్‌గా పాపులర్ పొందిన సిద్ధరామయ్య వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది. దీంతో ఐదేళ్ల విరామం తర్వాత మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీపై సిద్ధరామయ్య ఆసీనులు కాబోతున్నారు. ఈ మేరకు సిద్ధరామయ్య తన కొత్త జట్టుతో కలిసి మే 20వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సిద్ధరామయ్య సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పెరిగారు. మైసూరు సమీపంలోని సిద్ధరామనహుండిలో 1948 ఆగస్టు 12వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరూ చదువుకోలేదు. ఈయన రాష్ట్రంలో మూడో అతి పెద్ద సమాజిక వర్గమైన కురుబ (ఓబీసీ)కి చెందిన వారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఎక్కువగా ఆసక్తి ఉన్న సిద్ధరామయ్య ఉన్నత చదువులు చదివారు. మైసూరులో న్యాయవాదిగా, న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పని చేశారు. రైతు ఉద్యమాల్లో పాలుపంచుకుంటూ రైతు నాయకుడు నంజుండస్వామి ప్రియ శిష్యుడిగా మారిపోయారు. ఆయన స్ఫూర్తితోనే 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత తిరుగులేని నాయకుడిగా మారారు. 1963లో తొలిసారి చాముండేశ్వరి అసెంబ్లీ స్థానం నుంచి భారతీయ లోక్ దళ్ అభ్యర్థిగా పోటీ చేసి సంచలన విజయం సాధించారు. ఆ తర్వాత జనతా పార్టీలో చేరారు. అప్పటి సీఎం రామకృష్ణ హెగ్డే మాతృభాష పరిరక్షణ కోసం స్థాపించి కన్నడ కావలు సమితి తొలి అధ్యక్షుడిగా సమర్థంగా పని చేశారు.1985 ఎన్నికల్లో గెలిచి హెగ్డే ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. 1989 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 1992లో జనతాదళ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1994ల ఎన్నికల్లో గెలిచి దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేశారు. దేవెగౌడ ప్రధాని పదవి చేపట్టడంతో 1996లో జేహెచ్ పటేల్ సీఎం అయ్యారు. అనంతరం సిద్ధరామయ్య ఉపముఖ్యమంత్రి పదవిలో వచ్చారు. జనతాదళ్ జేడీఎస్, జేడీయూగా చీలి పోవడంతో సిద్ధరామయ్య దేవెగౌడ నాయకత్వంలోని జేడీఎస్‌లో చేరి రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. 1999 విధాన సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2004లో ఏర్పడిన కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా పని చేశారు. అయితే దేవగౌడ తన తనయుడు కుమారస్వామిని ముందుకు తెచ్చేందుకు 2006లో పార్టీ నుంచి సిద్ధరామయ్యను సస్పెండ్ చేశారు. దీంతో ఆయన కాంగ్రెస్ లో చేరారు. 2008 ఎన్నికల్లో గెలిచి సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు. 1983 నుంచి ఇప్పటి వరకు సిద్ధరామయ్య మొత్తం 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యారు. సిద్ధరామయ్యకు కర్ణాటకలో మంచి మాస్ ఇమేజ్ ఉంది. దేవరాజ్ అరసు తర్వాత ఐదేళ్ల పాటు సీఎంగా పని చేసింది ఈయన ఒక్కరే. అహింద (బలహీన వర్గాల) సముదాయానికి ప్రతినిధిగా ఉండేందుకు ఇష్టపడే సిద్ధరామయ్య జనతా పరివార్ నుంచి 2006లో కాంగ్రెస్ లోకి వచ్చినా పార్టీ భావజాలాన్ని సులువుగానే ఒంటపట్టించుకున్నారు. జనతాదళ్ లోనూ డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా పని చేసి ఇప్పటి వరకూ 13 సార్లు బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. అలాగే 2013లో కాంగ్రెస్ పార్టీ 122 సీట్లతో ఘనవిజయం సాధించడంలో సిద్ధూ కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత కూడా అద్భుతమైన పథకాలు తీసుకొచ్చి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. అధిష్టానం కూడా తాను చెబితే వినే స్థాయిలో ఉందటేనే సిద్ధూ పొజిషన్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. డీకే శివకుమార్ తో తనకు పోటీ ఉన్నప్పటికీ.. అంతా కలిసికట్టుగా పని చేసి పార్టీని గెలిపించడంలో సిద్ధరామయ్య ప్రముఖ పాత్ర పోషించారు. అదే ఆయనను మరోసారి సీఎంను చేసింది.

## జల్లి కట్టు నిషేధించలేం

(మొదటిపేజీ తరువాయి)

మరో కోణంలో ఆలోచించడం, దానిపై వేరే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం సరికాదు" సుప్రీంకోర్టు గతేడాదే సుప్రీంకోర్టు జల్లికట్టుపై కీలక వ్యాఖ్యలు చేసింది. మొత్తం ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. జల్లికట్టులో హింస ఉంటుందన్న వాదనలనూ కొట్టి పారేసింది. హింస ఉన్నప్పటికీ నెత్తుటి క్రీడ అని చెప్పలేమని తేల్చి చెప్పింది. ఎలాంటి ఆయుధాలు వాడడం లేదు కదా అని..తిరిగి ప్రశ్నించింది. 2017 నుంచే దీనిపై వాదనలు వినిపిస్తున్నాయి. ఆ ఏడాదే తమిళనాడు ప్రభుత్వం జల్లికట్టుకి అధికార ముద్ర వేసింది. ఖతీవలవనిబితినీని నీట అతీబీవశ్రీబిఎ బినీ ంనితిఎజీశ్రీబ 2017 చట్టంలో సవరణలు చేసింది. ఈ సవరణలపై కొందరు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. చట్టబద్ధం చేయడాన్ని వ్యతిరేకించారు. అప్పటి నుంచి విచారణ కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు సుప్రీం ధర్మాసనం ఆ సవరణను సమర్థించింది.

## ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4 శాతం డీఏ పెంపు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అయితే రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అప్పటివరకూ చెల్లించాల్సిన కరవుభత్యాన్ని జనవరిలో నాలుగు శాతానికి పెంచింది. అంటే కరవుభత్యాన్ని 34 శాతం నుండి 38 శాతానికి పెంచుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వు వెలువరించారు. ఈ కారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు రాష్ట్రం నాలుగు శాతం కరవు భత్యాన్ని వచ్చే జూన్‌లోనే అమలు చేస్తుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు భావించారు. అయితే ఉన్నట్టుండి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కరవు భత్యాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా ఈ పెంచిన కరవు భత్యం ఏప్రిల్ 1నుంచి వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తున్నారని, అందకే వారికి తగిన సదుపాయాలు కల్పిస్తున్నట్టు స్టాలిన్ పేర్కొన్నారు. మునుపటి అన్నాడీఎంకే అసమర్థపాలన, కరోనా లాక్‌డౌన్ తదితర కారణాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సంతృప్తికరంగా లేకున్నా ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్లనుఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వానికి రూ.2,366.82 కోట్ల మేరకు అదనపు భారం పడనుంది.

## మోదీ మంత్రివర్గంలో స్వల్ప మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

మేఘ్‌వాల్‌కు ప్రస్తుతం ఉన్న శాఖలతోపాటు అదనంగా న్యాయ శాఖను అప్పగించారు. ఈ ఆశ్చర్యకర పరిణామాన్ని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో వెల్లడించింది.అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖల సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. గతంలో ఆయన చీఫ్ విప్‌గానూ, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగానూ పని చేశారు. ఆయన రాజస్థాన్‌లోని బికనీర్ నియోజకవర్గం నుంచి 2009లో లోక్‌సభ సభ్యునిగా మొదటిసారి గెలిచారు. ఆయనకు 2013లో ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం లభించింది.తాజా మార్పుల ప్రకారం అర్జున్ రామ్ మేఘ్‌వాల్ న్యాయ శాఖ సహాయ మంత్రిగా, ఇండిపెండెంట్ ఛార్జ్‌తో వ్యవహరిస్తారు. సుప్రీంకోర్టు కొలీజియం విధానంతో కిరణ్ రిజిజు ఘర్షణ పడిన నేపథ్యంలో ఆయన న్యాయ శాఖ మంత్రి పదవిని కోల్పోయారు. న్యాయమూర్తులను నియమించే కొలీజియం విధానం పారదర్శకంగా లేదని కిరణ్ రిజిజు ఆరోపించిన సంగతి తెలిసిందే.ఇప్పటి వరకు భూగోళ శాస్త్రాల మంత్రిత్వ శాఖను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ నిర్వహించారు. ఈ శాఖను కిరణ్ రిజిజుకు అప్పగించారు. కిరణ్ రిజిజు న్యాయ మంత్రి పదవిని 2021 జూలై 8న చేపట్టారు. ఆయన 2019 మే నుంచి 2021 జూలై వరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జి)గా వ్యవహరించారు.

## 26న ఢిల్లీకి సీఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరుతూ సీఎంవో వర్గాలు పీఎంవోకు సమాచారం అందిచినట్లు తెలుస్తోంది. అదే క్రమంలో అమిత్ షా అపాయింట్‌మెంట్‌కు కూడా సీఎంవో వర్గాలు ఆయన పేషీకి సమాచారం అందించారు. ఈనెల 27వ తేదీన నీతి ఆయోగ్ బృందం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో సమావేశం కానుంది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు లేదా ఆర్థికశాఖ మంత్రులు పాల్గొనున్నారు. ఇందుకోసం సీఎం జగన్ ఈనెల 26వ తేదీ సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. అదే రోజు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలుసుకునే అవకాశం ఉంది. మరుసటి రోజు విజ్ఞాన్ భవన్‌లో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొంటారు.ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు. అలాగే విభజన సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. పోలవరం ప్రాజెక్ట్, నిధులు విధుల విభజన, ప్రత్యేక హోదా గురించి మాట్లాడనున్నారు. పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9లో పొందుపరిచిన 91 సంస్థల ఏర్పాటు, షెడ్యూల్ 10 కింద చేర్చిన 142 ఇతర సంస్థల విభజన అంశాన్ని నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం జగన్ ప్రస్తావించే అవకాశం ఉంది. అదే రోజున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశం అయ్యే అవకాశాలు ఉన్నాయి. మోదీ అపాయింట్‌మెంట్ కోసం ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. నీతి ఆయోగ్ ముగిసిన తరువాత సీఎం జగన్ ప్రధానితో భేటీ అయ్యేలా అధికారులు షెడ్యూల్ రెడీ చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మోదీ, అమిత్ షాలతో రాజకీయ చర్చలు కూడా జరిపే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీకి తాము ఎప్పుడూ వ్యతిరేకంగా లేమని అందుకే ఏపీలో తమకు వ్యతిరేకంగా ఏర్పడే కూటమిలో చేరవద్దని విజ్ఞప్తి చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల తర్వాత కూడా తమ మద్దతు పూర్తిగా బీజేపీకే ఉంటుందనే హామీ జగన్ ఇస్తారని అంటున్నారు. మరో వైపు వైసీపీ విముక్త ఏపీ కోసం.. తాము కృషి చేస్తామని బీజేపీ నేతలు కూడా కలిసి రావాలని పవన్ కల్యాణ్ పిలుపునిస్తున్నారు. పవన్ ప్రతిపాదనను హైకమాండ్ వద్ద పెట్టామని చెబుతున్నారు. ఈ క్రమంలో బీజేపీ తీసుకునే నిర్ణయాలు కీలకం కాబోతున్న తరుణంలో జగన్ ఢిల్లీ పర్యటన తర్వాత ఏపీ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

## ఆర్ 5 జోన్ లో పట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

వేగంగా అడుగులు వేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హౌసింగ్‌పై గురువారం సమీక్ష నిర్వహించారు. ఇళ్లు లేని ప్రతి పేదవాడికి సెంటు భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ఈ నెల 26న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఒకేసారి 50 వేల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చే విధంగా అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే జగన్ పలు సలహాలు సూచనలు కూడా ఇచ్చారు. 50 వేలకుపైగా లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేందుకు 1460 ఎకరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.మరోవైపు పేద ప్రజలు సెంటు భూమిలో ఎలా ఇళ్లు కట్టుకుంటారని విమర్శించారు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు. తమ హయాంలో పేదలకు కనీసం 3 సెంట్ల భూమి ఇచ్చామంటూ చంద్రబాబు జగన్ పై విమర్శలు గుప్పించారు. చంద్రబాబు సెంటు భూమి వ్యాఖ్యలపై కౌంటర్ ఎటాక్ చేశారు ఏపీ మంత్రి జోగి రమేశ్. టీడీపీ హయాంలో ఆ సెంటు స్థలం కూడా చంద్రబాబు ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఆ సెంటు స్థలంలోనే పేద ప్రజలు టీడీపీని పూడ్చటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.మొత్తం 51 వేల 392 మంది లబ్దిదారులకు అమరావతిలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. ఐనవోలు, మందడం, కృష్ణాయ పాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రు, బోరుపాలెం, పిచ్చుకలపాలెం, అనంతవరంలో పట్టాల పంపిణీ జరగనుంది.

## టిడ్కో ఇళ్లు మీ ఆస్తి..వదులుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. పేదవాడి సొంతింటి కల నిజం చేయాలనేదే నా లక్ష్యం. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహాయ సహకారాలతో టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాను. నీరు, రోడ్లు, కరెంటు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. 300, 365,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 7.50 లక్షల ఇళ్లు నాడు పేదలకు మంజూరు చేశాం. మొత్తం ఇళ్ల నిర్మాణంపే 30 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు.

మంజూరు చేసిన టిడ్కో ఇళ్లలో 3.15 లక్షల ఇళ్లు పూర్తి చేశాం. పేదలకు ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తామనినాడే చెప్పాం. 40 నుంచి 60 అడుగుల రోడ్ల తో టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు డిజైన్ చేశాం. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఒక సెంటు స్థలం ఇస్తామంటున్నారు. 12 అడుగుల రోడ్డు మాత్రమే



జగన్ చెప్పిన కాలనీల్లో రోడ్డు వస్తుంది. ఈ రోడ్డుపై రెండు వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. టిడ్కో కాలనీల్లో సిమెంటు రోడ్లు వేశాం. పార్కులు కట్టాం. డ్రైనేజి, అంగన్ వాడి సెంటర్ లు ఏర్పాటు చేశాం. ఆస్తి విలువ పెంచాలని చూశాం. గ్రానైట్ రాళ్లతో కిచెన్, వాష్ ఏరియా, ట్యాప్ లు ఉండేలా వసతులు కల్పించాం. మీ ఇంటికి ఏ కలర్ వేసుకోవాలనో ఆ ఛాయిస్ కూడా మీకే ఇచ్చాం. గవర్నమెంట్ కలర్ వేస్తే గవర్నమెంట్ ఇల్లు కట్టిచ్చినట్లు అవుతుంది. మీ ఇల్లు కాబట్టి మీకు నచ్చిన కలర్ వేసుకోవచ్చు అని చెప్పాం. మీ అభిప్రాయాలు గౌరవించాం. మనం కట్టిన ఇళ్లకు రంగులు వేసుకుని జగన్ దిష్టిబొమ్మల్లా పెట్టాడు. ఆనాడు లక్షా 50 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇచ్చాం. కేంద్రం లక్షా 50 వేలు ఇచ్చింది. ఈ 3 లక్షలు కాకుండా కామన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కి నిధులిచ్చాం. మంచి ఇళ్లు ఈ సైకో సీఎం వచ్చి చెడగొట్టాడు. పిల్లలు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్లు పెట్టాం. వన్ టైమ్ సెటిల్ మెంట్ అని దానికి కూడా డబ్బులు కట్టించుకున్నాడు. టిడ్కో ఇళ్లు మీ ఆస్తి..వదలిపెట్టొద్దు. ఐదేళ్లు గడుస్తున్నా ఒక్క ఇంటికి కూడా ప్రణాళిక తయారు చేయలేకపోయాడు. నాలుగేళ్లలో 5 ఇళ్లు కట్టాడు. జగన్ ఉండే ఇంటిలోనేమో వంద గదులు ఉండాలి. ఊరికో ప్యాలెస్ కావాలి. పేదవారికిమంచి ఇల్లు ఉండకూడదా అని ప్రశ్నించారు.

# అఖిలప్రియ వర్సెస్ జశ్వంతి

**కర్నూలు :**

నిన్న జరిగిన తోపులాటలో తన తండ్రి ఏవీ సుబ్బారెడ్డి షర్ట్ చిరిగిపోయిందని, ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు ఆయన కూతురు జస్వంతిరెడ్డి. అభిమానుల నుంచి కాల్స్ రావడంతో జరిగిన ఘటనపై స్పందించిన జస్వంతి రెడ్డి మాజీ మంత్రి అఖిల ప్రియపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భూమా నాగిరెడ్డి చాలా సభలు, కార్యక్రమాలలో తాను, ఏవీ సుబ్బారెడ్డి వేరు కాదని చెప్పినట్లు గుర్తుచేశారు. చిన్నప్పటినుంచీ అఖిలప్రియను ఎత్తుకుని పెంచిన వ్యక్తి తన తండ్రి సుబ్బారెడ్డి అన్నారు. తండ్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై ఆమె దాడి చేయించడం దారుణం అన్నారు. ప్రశాంతంగా యువగళం పాదయాత్ర జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అఖిలప్రియ తన తండ్రి ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేయించారని ఆరోపించారు. ఇది తొలిసారి జరిగిన దాడి కాదని, గతంలో టీడీపీ చేపట్టిన సైకిల్ యాత్రలోనూ తమపై దాడి జరిగిందన్నారు. ఎలాంటి టైమ్ లో ఏం చేస్తుందోనని ఆలోచించకుండా బజారు మనిషిలా అఖిల ప్రియ వ్యవహరించారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో తమ ఇంటిపై రెక్కీ నిర్వహించి, తన తండ్రి ఏవీ సుబ్బారెడ్డిని హత్య చేయించేందుకు మనుషుల్ని ఏర్పాటు చేసి కుట్ర చేసిందని ఆరోపించారు. లో గ్రేడ్ ఆలోచనలతో ఆమె ఇలాంటి పనులు చేసింది. అయినా కూడా చిన్నప్పటినుంచీ ఆమెను ఎత్తుకుని ప్రేమగా వ్యవహరించిన వ్యక్తి కనుక, కూతురులాగ చూసుకున్నాడని ప్రశాంతంగా ఉన్నారని జస్వంతి రెడ్డి చెప్పారు. పార్టీని గౌరవించి చట్ట ప్రకారమే నడుచుకుంటున్నామని, నిన్న జరిగిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు.లోకేష్ అన్న పాదయాత్ర డిస్బర్బ్ అవుతుందని తానుగానీ, తన తండ్రి ఏవీ సుబ్బారెడ్డిగానీ ఎలాంటి ప్రెస్ మీట్లు పెట్టలేదన్నారు. కానీ తండ్రి సమానమైన వ్యక్తిపై దారుణమైన ఆరోపించడానికి అఖిలప్రియకు మనసెలా ఒప్పిందని ప్రశ్నించారు. చేసిన ఆరోపణలపై ఆమెతో ఆధారాలు ఉన్నాయా, ఉండవు అన్నారు. బజారు మనిషిలా అంత దారుణమైన వ్యాఖ్యలు చేసే మనిషి అఖిలప్రియ అంటూ మండిపడ్డారు. ఆళ్లగడ్డ, నంద్యాల నుంచి పోటీ చేయాలని పార్టీ తమను ఆదేశిస్తే తానైనా, లేక తన తండ్రి ఏవీ సుబ్బారెడ్డి అయినా సరే బరిలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నామన్నారు జస్వంతి రెడ్డి. ఒకవేళ అఖిలప్రియకు టికెట్ ఇస్తే మాత్రం ఆమె పతనానికి తాము పోటీ చేస్తామని వీడియోలో మాట్లాడుతూ స్పష్టం చేశారు.నంద్యాల టీడీపీలో మొదలైన అంతర్యద్ధం అరెస్టుల వరకు వెళ్లింది. నిన్న రాత్రి ఏవీ సుబ్బారెడ్డిపై జరిగిన దాడి కేసులో మాజీ మంత్రి భూమా అఖిలప్రియను పోలీసులు అరెస్టు చేశారు. ఆమెతోపాటు భార్గవ్ రామ్, పీఏ మోహన్‌కు కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిని నంద్యాల పీఎస్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సలు నిర్వహించిన అనంతరం అఖిలప్రియ దంపతులను కోర్టులో ప్రవేశపెట్టారు. అఖిలప్రియ దంపతులకు మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా, నంద్యాల జిల్లాలో ఈ రెండు వర్గాల మధ్య ఎప్పటి నుంచో వర్గ పోరు నడుస్తోంది. ఏవీ సుబ్బారెడ్డి ఒకప్పుడు భూమా కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. భూమా నాగిరెడ్డికి ఏవీ సుబ్బారెడ్డి మంచి స్నేహితుడు. ఆయన చనిపోయిన తర్వాత రాజకీయం పూర్తిగా మారిపోయింది. కొన్ని ఏళ్ల నుంచి కొనసాగుతున్న విభేదాలు ఇప్పు?డు తారాస్థాయి చేరుకున్నాయి. లోకేష్ పాదయాత్ర జరుగుతున్న టైంలోనే ఈ రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి.

**విచారణకు త్రిసభ్య కమిటీ**

అఖిల ప్రియ, సుబ్బారెడ్డి మధ్య వార్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. పార్టీ ముఖ్యనేతలతో మాట్లాడిన ఆయన వివాదం పరిష్కారానికి సీనియర్లతో కమిటీ వేసినట్టు సమాచారం. లోకేష్ యువగళం పాదయాత్ర సాగుతున్న నంద్యాలలో టీడీపీ అంతర్గత పోరుపై టీడీపీ అధినేత చంద్రబాబు ఫోకస్ పెట్టారు. లోకేష్‌కు స్వాగతం చెప్పే టైంలో సుబ్బారెడ్డి, అఖిల ప్రియ వర్గీయుల రోడ్లపై కొట్టుకోవడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉదయం పార్టీ ముఖ్యనేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వివాదం పరిష్కారానికి తిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసిన చంద్రబాబు.. నంద్యాలలో ఏం జరిగిందో ఏం జరుగుతుందో నివేదిక ఇవ్వాలని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలుస్తోంది. కొన్ని కొన్నిసార్లు టీడీపీ సమావేశాల్లో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు వచ్చి కావాలని రెచ్చగొట్టే పనులు చేసే అవకాశం ఉందని... అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు.

# అంతా ఆయనే చేశాడా...

**బెంగళూరు :**

కర్ణాటకలో బీజేపీ ఓటమికి ప్రధాన కారణం బీఎల్ సంతోష్. ఆయనే ఓటమి బాధ్యతను తీసుకోవాలంటున్నారు కమలనాధులు. కన్నడ రాజకీయాల్లో బీఎల్ సంతోష్ కొన్నాళ్లుగా కెలుకుతూ ఉండటం కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. యద్యూరప్పను ముఖ్యమంత్రి పదవి నుంచి దించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అంతే కాదు లింగాయత్ సామాజకవర్గంపై అనవసర వ్యాఖ్యలు చేసి వారిని దూరం చేశారన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. దీంతో పాటు అభ్యర్థుల ఎంపికలో కూడా బీఎల్ సంతోష్ వేలు పెట్టడం, కొందరు ముఖ్యులకు సీట్లు దక్కకపోవడంలో కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అందులో జగదీష్ శెట్టర్ లాంటి నేత ఒకరు. కర్ణాటకలో లింగాయత్‌లతో పాటు దళిత ఓటు బ్యాంకు కూడా ఎక్కువ. అయితే దళితులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు. మల్లికార్జున ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉండటంతో దళిత ఓటు బ్యాంకు కూడా కాంగ్రెస్ కు గంపగుత్తగా పడింది. ఈ రెండు సామాజికవర్గాలను బీఎల్ సంతోష్ నిర్లక్ష్యం చేశారంటున్నారు. కర్ణాటక బీజేపీలో బీఎల్ సంతోష్ లింగాయత్ నాయకత్వాన్ని నిర్లక్షం చేశారన్న ఆరోపణలు న్నాయి. కనీసం పార్టీ కార్యాలయంలోకి లింగాయత్ నేతలకు ఎంట్రీ కూడా లేదన్న కారణంతో వారు ఆగ్రహంగా ఉన్నారు. దీంతోనే లింగాయత్ వర్గానికి చెందిన మఠాధిపతులు బహిరంగగానే బీజేపీకి వ్యతిరేకంగా ఓటు చేశారు. లింగాయత్ సామాజికవర్గానికి చెందిన పెద్దలు కూడా చివరి నిమిషంలో బీజేపీకి ఓటు వేయవద్దని పిలుపు నివ్వడం కూడా బీజేపీ దారుణ ఓటమికి కారణమయింది. బీఎల్ సంతోష్ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన నేత. కర్ణాటకలోని ఉడిపి ప్రాంతానికి చెందిన వారు. ఆయన మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడిగా మారారు. అందువల్లనే ఆయన హవా కర్ణాటకలో కొనసాగింది. ప్రభుత్వం లోనూ ఆయన చికాకు కల్పించారన్న వాదనలు లేకపోలేదు. కర్నాటక ప్రాంతానికి చెందిన బీఎల్ సంతోష్ సహజంగానే కర్ణాటకలో వేలు పెట్టి సర్వనాశనం చేశాడని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన నిర్ణయాలు, పార్టీ అధినాయకత్వానికి తప్పుడు నివేదికలు పంపడం, ముఖ్యమంత్రులను మార్చడం, అభ్యర్థుల ఎంపిక ఇవన్నీ బీఎల్ సంతోష్ నిర్వాకం కారణంగానే జరిగాయని నమ్ముతున్నారు. అందుకే ఇప్పుడు కన్నడ కమలం నేతలందరూ బీఎల్ సంతోష్ ను తిట్టిపోస్తున్నారు. ఇప్పటికైనా సంతోష్ జోక్యం ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. ఇలా చివరకు కన్నడ రాష్ట్రంలో కమలం పార్టీని ముంచింది బీఎల్ సంతోష్ అనే టాక్ బలంగా వినిపిస్తుంది.

# వరుస సమావేశాలతో కేసీఆర్ బిజీబిజీ

**హైదరాబాద్ :**

కొద్దీ రోజుల గ్యాప్‌లోనే గులాబీ బాస్, ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు(కేసీఆర్) వరుస సమావేశాలపై పార్టీ నాయకులతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి పెంచారు. మొన్నటి సమావేశంలోనే రాబోయే ఎన్నికలపై పార్టీ శ్రేణులకు క్లారిటీ ఇచ్చిన సీఎం కేసీఆర్, మూడు వారాల్లోనే మళ్లీ బీఆర్ఎస్ పార్లమెంటరీ, లెజిస్లేచర్ పార్టీ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహమే ఎజెండాగా సాగిందీ ఈ మీటింగ్. పోయిన మీటింగ్‌లోనే ఆర్నెల్లలో ఎన్నికలని గుర్తుచేసిన సీఎం కేసీఆర్..ఈసారి బీ రెడీ అంటూ అందరినీ అలర్ట్ చేశారు గులాబీ దళపతి .తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 6నెల్లలో ఎన్నికలు ఉన్నాయని, ఎన్నికల షెడ్యూల్ తీసేస్తే మిగిలేది 5 నెలల సమయమే ఉందని కేడర్‌కి గుర్తు చేశారు. నేతలు పూర్తిస్థాయిలో నియోజక వర్గాలకు పరిమితం కావాలన్నారు. తెలంగాణ తెచ్చింది మనమే,అభివృద్ధి చేసింది మనమేన న్నారు. మళ్లీ మూడు వారాల్లోనే ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ, ఎంపీలతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహమే ఎజెండాగా సాగిందీ మీటింగ్‌ఈ దశాబ్ధకాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేస్తూ ప్రజలతో కలిసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు సీఎం కేసీఆర్. సర్వేలన్నీ సానుకూలంగా ఉన్నాయన్న సీఎం కేసీఆర్.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా 95 నుంచి 105 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దంలో శతాబ్ది అభివృద్ధి చేశామన్న సీఎం కేసీఆర్ ఇచ్చిన కొత్త స్లోగన్‌తో ప్రజల్లోకి వెళ్తామన్నారు మంత్రి జగదీశ్‌రెడ్డి. కర్నాటకలో బీజేపీ చతికిలబడిందని, మరో దారిలేక ప్రజలు అక్కడ కాంగ్రెస్‌కు ఓటేశారని విమర్శించారు. దశాబ్ధకాలం ఉత్సవాలను పండుగలా జరుపుతామన్నారు మంత్రి మల్లారెడ్డి. సర్వేల ప్రకారం 103 సీట్లు వస్తాయని, మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. మొత్తానికి బీజేపీపై ఇప్పటికే గురిపెట్టిన గులాబీబాస్ కర్నాటక ఫలితాలతో ప్రత్యర్థులకు ఎక్కడా అవకాశం ఇవ్వొద్దని దిశానిర్దేశం చేశారు. ఓ పక్క బీజేపీ మరోవైపు కాంగ్రెస్.. విజయంపై ఆ రెండు పార్టీలు ఆశలు పెట్టుకున్న టైంలో హ్యాట్రిక్ విక్టరీ కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు కేసీఆర్.

# సొంత పార్టీ నేతలపైనే ట్రోలింగ్స్

**హైదరాబాద్ :**

తెలంగాణ యూత్ కాంగ్రెస్ వార్ రూమ్‌పై సైబర్ క్రైమ్ పోలీసుల దాడి వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఫిర్యాదు నేపథ్యంలోనే సోదాలు జరిపినట్లు పోలీసులు స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో గ్రూపు గొడవలు పతాక స్థాయికి చేరాయి. రెండ్రు రోజుల క్రితం సైబర్ క్రైమ్ పోలీసుల దాడి చేయడం రాజకీయంగా దుమారాన్ని రేపింది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో పోలీసులు వెల్లడించిన విషయాలు తెలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు షాక్ అయ్యారు.
వార్ రూమ్‌పై సైబర్ పోలీసులు దాడి చేయడానికి పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫిర్యాదే కారణమని పోలీసులు వెల్లడించారు. “కాంగ్రెస్ పార్టీకి పట్టిన క్యాన్సర్ ఎవరు అంటూ” ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఉత్తమ్ ఫోటోకు మాస్క్ వేసి వీటిని వైరల్ చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఉత్తమ్ కుమార్ రెడ్డికి వ్యతిరేకంగా వచ్చిన పోస్టులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆరా తీసిన పోలీసులకు ఆయన ఇంటికి సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ వార్ రూమ్ ఉన్నట్లు గుర్తించారు. వార్ రూమ్ ఇంఛార్జి ప్రశాంత్‌తో పాటు మరో నలుగురు అక్కడ పనిచేస్తున్నట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పోస్టులు వేయడానికి వినియోగించిన కంప్యూటర్లు, హార్డ్ డిస్కులను సైబర్ విశ్లేషణ కోసం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారుబంజారాహిల్స్‌లోని యూత్ కాంగ్రెస్ వార్‌రూమ్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసులు సోదాలు చేయడం, కంప్యూటర్ హార్డ్‌డిస్కులతోపాటు కార్యకర్తల ఫోన్లను తీసుకెళ్లడంపై మొదట కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగులు వస్తుండడంతో ఆయన చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని పోలీసులు చెప్పడంతో 40 రోజుల క్రితం చేసిన ఫిర్యాదుపై ఇప్పుడు దర్యాప్తు చేయడమేంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏప్రిల్ 5న ఫిర్యాదు చేయగా.. సైబర్‌క్రైమ్ పోలీసులు మే 15 రాత్రి యూత్ కాంగ్రెస్ వార్‌రూమ్ కార్యాలయంలో సోదాలు చేశారు. ఈ కార్యాలయం నుంచే ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పోస్టింగులు అప్‌లోడ్ అవుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు కార్యాలయంలోని కంప్యూటర్ హార్డ్‌డిస్కులతోపాటు వార్‌రూమ్ ఇన్‌చార్జి ప్రశాంత్ స్మార్ట్‌ఫోన్‌ను, మరో యూత్ కాంగ్రెస్ నాయకుడి ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించడంతో భయాందోళనకు గురవుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమపై దాడులు చేసి తమ సమాచారాన్ని దొంగిలించిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధక్షుడు శివసేనారెడ్డి ఆరోపించారు. ఒక నెంబర్ నుంచి దుష్ప్రచారం జరిగితే ఆ వ్యక్తి ఎవరన్నది తెలుసుకోవాలని, తమ కంప్యూటర్‌లను ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. వార్ రూమ్‌లో అన్ని జిల్లాల యూత్ కాంగ్రెస్ కమిటీల సమాచారం ఉందని, దానిని ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు.మరోవైపు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా పెట్టిన పోస్టింగుల కోసం వినియోగించిన సిమ్‌కార్డు నెంబర్ ఏపీకి చెందినది కావడంతోనే దర్యాప్తులో జాప్యం జరిగిందని సైబర్ పోలీసులు చెబుతున్నారు. వార్‌రూమ్ ఇన్‌చార్జి ప్రశాంత్‌ను విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. మరోవైపు సొంత పార్టీ నేతలపై యూత్ కాంగ్రెస్ ఆధ?వర్యంలో దుష్ప్రచారం చేయడానికి కారణం ఏమిటనే చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. సైబర్ పోలీసులు వార్ రూమ్ ఇంఛార్జిని అరెస్ట్ చేయడంతో జరిగిన పరిణామాలను కాంగ్రెస్ పార్టీ పెద్దలకు నాయకులు నివేదిక ఇవ్వడంతో ప్రశాంత్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ప్రజలంతా కేసిఆర్ కుటుంబమే

**బండి సంజయ్...నీ ఇంట్లో వాళ్లు,నీదగ్గరి బంధువులు కూడా కేసిఆర్ ప్రభుత్వ లబ్ధిదారులే**

**అమెరికాలో ఉన్నత జీవితాన్ని వదులుకొని తెలంగాణ ఉద్యమంలో కోట్లాడిన కేసిఆర్ కుటుంబం గురించి బండి సంజయ్ మాట్లాడడం హాస్యాస్పదం**

**విదేశీ కంపెనీల పెట్టుబడులు ఆకర్షించడానికి కెటిఆర్ చేసినంత కృషి దేశ ప్రధాని కూడా చేయలేదు**

**కవితమ్మ తెలంగాణ సంస్కృతిని విశ్వ వ్యాప్తం చేసింది**

**- బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్**

తెలంగాణ ప్రజలంతా కేసిఆర్ కుటుంబమేనని బండి సంజయ్ ఇకనైనా తెలుసుకుంటే మంచిదని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు కేసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఆనతి కాలంలోనే దేశంలోనే నెంబర్ వన్ గా ఎదిగిందని గణాంకాలతో సహా పార్లమెంట్ సాక్షిగా నీ కేంద్ర మంత్రులే ఈ విషయాన్ని వెల్లడించారని గుర్తు చేశారు. విదేశీ కంపెనీల పెట్టుబడులు ఆకర్షించడానికి యువనాయకుడు కెటిఆర్ చేసినంత కృషి ప్రధాని కూడా చేయలేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితమ్మ ఉద్యమంలోనే జాగృతి సంస్థతో తెలంగాణ సంస్కృతిని విశ్వ వ్యాప్తం చేసిందని గుర్తు చేశారు. కేసిఆర్ పిల్లలు ప్రజా ఆమోదంతో రాజకీయాల్లో ఉన్నారని,ఉద్యమం కోసం అమెరికాలో వారి ఉన్నత ఉద్యోగాలు,లగ్జరీ జీవితాన్ని వదులుకున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడి,ఎన్నో కేసులు,అరెస్టులు ఎదుర్కొని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. యువ నాయకుడు కెటిఆర్ కృషి వల్ల రాష్ట్రంలో 3లక్షల కోట్ల పెట్టుబడులు,18వేల కంపెనీలు,16 లక్షల ఉద్యోగాలు లభించాయని అన్నారు. ప్రపంచ ప్రముఖ దిగ్గజ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయని ముఖ్యమంత్రి కేసిఆర్ గారి విజన్ ను,కెటిఆర్ గారి చొరవను బహిరంగ వేదికల మీదనే కొనియాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీ తన దోస్త్ అదానీ కోసం పైరవీలు చేసి శ్రీలంక,ఆస్ట్రేలియా లాంటి విదేశాల్లో భారత దేశ పరువు మంటగలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని కోసమే ప్రధాని పదవి చేపట్టినట్టు మోడీ దేశ సంపద అంతా అధానికి దారాదత్తం చేస్తున్నారని,మోడీ దేశానికి అసలు ఎం చేశాడో బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఒలంపిక్ క్రీడాకారులు నిరసన వ్యక్తం చేస్తుంటే కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని,బీజేపీ ఎంపీపై ఆడ పిల్లలు ప్రత్యక్షంగా రోడ్డు మీదకి వచ్చి ఆరోపణలు చేస్తుంటే..ఇక్కడ క్రీడల పోటీలు పెట్టుకొని,కేసిఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటన్నారు. దేశంలో ఏ రంగాన్ని మీరు ఉద్ధరించారు అని గొప్పలు చెప్పుకుంటున్నారు.5 నెలల్లో మేము కాదు నీవు, నీ మోడీ పత్తా లేకుండా పోతారని అన్నారు. కర్ణాటకలో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని,నీవు ప్రచారం చేసిన ఒక్క సిటు కూడా గెలువలేదు,నీ వల్ల ఏం కాదని నిచుట్టూ ఉన్నవాళ్లే నీ చాటుకు వచ్చి నవ్వుతున్నారు ముందు అది తెలుసుకో బండి సంజయ్ అని మంత్రి ఎద్దేవా చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ సాధించిన ప్రగతి మీద జరుగుతుంది. నీ ఇంట్లో వాళ్ళు కూడా కేసిఆర్ ప్రభుత్వ లబ్దిదారులే,నీ ఇంట్లో వాళ్లు, నీదగ్గరి బంధువులు కూడా దశాబ్ది వేడుకలు జరుపుకుంటారు ఒకసారి వారిని అడిగి తెల్సుకో బండి సంజయ్ అని అన్నారు.
కేసిఆర్ గురించి,కేసిఆర్ ఫ్యామిలీ గురించి నోటి కొచినట్టు మాట్లాడితే జాగ్రత్త,బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి వేముల హెచ్చరించారు.

# సొంతగూటికి రాజగోపాల్ రెడ్డి ?

**రాష్ట్రంలో బీజేపీ భవితపై అనుమానం**

**మళ్లీ కాంగ్రెస్‌లోకి వెళ్లాలని రాజగోపాల్‌రెడ్డి యోచన**

**3 రోజులుగా అనుచరులతో చర్చలు-**

**మోదీ గ్రాఫ్ పడిపోతోందని వ్యాఖ్యలు**



**హైదరాబాద్ :**

కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రకంపనలు తెలంగాణ రాజకీయాల్లో అప్పుడే మొదల య్యాయా? కాంగ్రెస్‌ను వీడిన నాయకులు పునరాలోచనలో పడుతున్నారా? మొన్నటిదాకా బీజేపీ వైపు చూసిన నేతలంతా మళ్లీ చేయందుకోవడానికే సిద్ధమవుతున్నారా.. అంటే అవుననే తెలుస్తోంది. ఝార్ఖండ్‌లో తన కంపెనీకి రూ.18వేల కోట్ల టెండర్ దక్కడంపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని, ఆయన బహిరంగ క్షమాపణ చెప్తే తాను తిరిగి కాంగ్రె?స‌లో చేరే విషయమై ఆలోచిస్తానని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన అనుయాయులతో అన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. బీజేపీలోనే కొనసాగాలా.. మళ్లీ కాంగ్రె?స‌లోకి వెళ్లాలా అన్న విషయమై రాజగోపాల్ మూడు రోజులుగా అన అనుయాయులతో చర్చిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ చర్చల్లో ఆయన కాంగ్రె?స‌లో చేరడం వైపే మొగ్గు చూపుతున్నారని, అయితే, రేవంత్ క్షమాపణలు చెప్పాలని కోరుకుంటున్నారని పేర్కొన్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు తర్వాత బీజేపీ మరింత బలహీనంగా మారిందని, తెలంగాణలో ఆ పార్టీ పుంజుకునే ప్రసక్తి లేదని రాజగోపాల్ తన అనుయాయులతో అన్నారు. ఈటలకు రాష్ట్ర బీజేపీ నాయకత్వం అప్పగించినా..మరో ఆరు నెలల్లోనే ఎన్నికలున్న నేపథ్యంలో పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండదని వివరించారు. కాంగ్రెస్ క్రమంగా పుంజుకుంటున్న కారణంగా వేరే పార్టీలవారెవరూ బీజేపీలో చేరబోరని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ గ్రాఫ్ కూడా పడిపోతున్నదని వివరించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 175 సీట్ల కంటే ఎక్కువ రావని రాజగోపాల్ అభిప్రాయపడ్డారు. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోనే బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని, మిగతా చోట్ల అంతగా ప్రభావం ఉండకపోవచ్చని అంచనా వేశారు. అయితే, బీజేపీ దయాదాక్షిణ్యాలతోనే తనకు టెండర్ దక్కిందన్న ఆరోపణలను రేవంత్ వెనక్కు తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్తే అప్పుడు కాంగ్రెస్ లో చేరే విషయమై ఆలోచించవచ్చునని రాజగోపాల్ అనుయాయులకు చెప్పారు.

## నారా లోకేష్ కుడి భుజానికి ఏంఆర్ఐ స్కానింగ్

**నంద్యాల**

నంద్యాల పద్మావతి నగర్ లో ఉన్న మ్యాగ్న ఎంఆర్ఐ సెంటర్ లో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుడి భుజానికి డాక్టర్లు ఏంఆర్ఐ స్కాన్ చేసారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశించిన సందర్భంలో భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తల తోపులాటలో నారా లోకేష్ కుడి భుజానికి గాయం అయింది. అప్పటి నుండి లోకేష్ నొప్పితో బాధపడుతూనే పాదయాత్ర కొనసాగిస్తున్నారు. ఫిజియథెరపీ, డాక్టర్ల సూచన మేరకు జాగ్రతలు తీసుకున్నా నొప్పి తగ్గలేదు. 50 రోజులు దాటిపోయినా ఇంకా నొప్పి తగ్గకపోవడం తో ఎంఆర్ఐ స్కానింగ్ చేయించాలని డాక్టర్లు సూచించారు.

## ఉపాధి హామీ కూలీలపై అడవిపంది దాడి

**సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీలపై అడవిపంది దాడి చేసింది. గురువారం ఉదయం దాదాపు 100 మంది ఉపాధి పనులు చేస్తుండగా హఠాత్తుగా కూలీలపై అడవి పంది విరుచుకుపడింది. ఈ ఘటనలో నరసింహులు అనే వ్యక్తికాలు విరిగిపోగా, మరో మహిళ రుక్కమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిద్దరిని ఆస్పత్రికి తరలించారు.

## వ్యవసాయ మార్కెట్ లో రైతుల అందోళన

**మహబూబాబాద్**



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో వ్యాపారస్తులు ఈనామ్ పేరుతో మోసాలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వ్యాపారులకు అధికారులు అండదం దలందిస్తున్నారని వారన్నారు. తమకు న్యాయం చేయాలంటూ మార్కేట్ ఎదుట రైతుల రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.

రైతులు తీసుకొచ్చిన ధ్యానం ను వ్యాపారస్తులు ఈనామ్ లో ఆన్లైన్ లో ఒక రేటు , ఇచ్చేది ఓ రేటు అంటూ మోసం చేస్తున్న వ్యాపారస్తుల లైసెన్స్ లు క్యాన్సల్ చేయాలంటూ డిమాండ్ చేసారు. ధర్నా నేపథ్యంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## బీజేపీ ఓబీసీ సమ్మేళనానికి భారీ స్పందన

**రంగారెడ్డి**

బీజేపీ తెలంగాణ ఓబీసీ సమ్మేళనానికి ఓబీసీలు, బీజేపీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్, ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ లకు కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ వద్ద ఘన స్వాగతం లభించింది. కొత్తపేట నుండి మోటార్ బైక్ ల ర్యాలీ నిర్వహించారు. ప్రచార రథమెక్కి ప్రజలకు అభివాదం చేస్తూ మోటార్ సైకిల్ ర్యాలీతో కలిసి నాగోల్ లో నిర్వహించే ఓబీసీ సమ్మేళనానికి బండి సంజయ్, లక్ష్మణ్ బయలుదేరారు.

## పాలెం గ్రామంలో రైతుల రాస్తారోకో

**మహబూబాబాద్**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయి పాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలరోజులు గడిచిన వరి ధాన్యం కొనుగోలు చేసిన లారీలు రావడంలేదని సొంత వాహనాలలో మిల్లుకు తీసుకొని పోతే 10 కేజీలు కటింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారని రైతులు 365 నేషనల్ హైవే మీద ముళ్లకంచలు వేసి రోడ్డు దిగ్బంధం చేశారు.సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.వరి ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు.భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి రైతులకు సర్ది చెప్పి ముళ్ళకంపలను తొలగించి రోడ్డు క్లియర్ చేశారు.అధికారులతో మాట్లాడుతూ న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

## కేసీఆర్ హయంలో కులవృత్తులకు తీరని అన్యాయంవిజయశాంతి

**హైదరాబాద్**

పనులు మానుకొని కుల వృత్తులు, సబ్బండ వర్ణాలు పోరాడితే తెలంగాణ వచ్చింది... రాష్ట్రం వచ్చాక గద్దెనెక్కిన కేసీఆర్ కుల వృత్తులకు తీరని అన్యాయం చేసిందని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాజ్యాంగ విరుద్ధమైన మత రిజర్వేషన్లు అమలు చేశారు... బీసీ కమిషన్ కు కోరల్లేకుండా చేశారు... బీసీ సంక్షేమానికి అత్తెసరు నిధులే కేటాయిస్తున్నాడు. తెలంగాణలో అన్యాయమవుతోన్న బీసీలకు న్యాయం చేసేలా ఇవాళ్టి బీసీ డిక్లరేషన్ ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చాక జనాభాకు తగ్గట్టే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీలకు వాటా ఇస్తాం. వెనకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచిన కేసీఆర్ కు ఓబీసీలు వచ్చే ఎన్నికల్లో చెంపపెట్టు లాంటి తీర్పునివ్వాలి... బిజెపిని గెలిపించాలని ఆమె అన్నారు.

# భగ్గుమంటున్న భానుడు

**రాజమండ్రి :**

భగ్గుమంటోన్న భానుడి ప్రభావంతో.. ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టాలంటే ఒకటికి పదిసార్లు జనం ఆలోచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో ఇప్పటికే నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. మరో మూడు రోజుల పాటు ఇదే తీవ్రతతో కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. పగటిపూటే కాదు.. రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వడగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. భానుడి ప్రతాపంతో ఏపీలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు నిప్పుల కొలిమిలా మారాయి. సాధారణం కంటే 4-6 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రత దాదాపుగా 46 డిగ్రీలను దాటిపోయింది. ప్రకాశం 46, ఏలూరు, విజయవాడలో 47, గుంటూరులలో 48 డిగ్రీలు, రాజమండ్రిలో అత్యధికంగా 49 డిగ్రీల టెంపరేచర్లు నమోదు అయినట్లు వెల్లడించింది.ఇక వడదెబ్బతో ఏపీలో ఇద్దరు మృతి చెందినట్లు తెలుస్తోంది. వడదెబ్బ తగిలి పలువురు ఆస్పత్రిపాలయ్యారు. పరిస్థితి మరో మూడురోజులు ఇలాగే ఉంటుందని.. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో మార్పులతో హెపటైటిస్-బీ ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు తెలిపారు. బయటకు వెళ్లేవాళ్లు తలకు రక్షణ ధరించాలి, మంచినీళ్లు, సహజ సిద్ధమైన పానీయాలు, ఓఆర్ఎస్ లాంటి ఎనర్జీ డ్రింక్స్ ను తీసుకెళ్లడం ఉత్తమమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### సుదీర్ఘ ప్రయాణాలకు క్యూ

ఎండలు సెగ పుట్టిస్తున్నాయి. ఫ్యాన్ కింద కూర్చున్నా ఉక్కపోతే. ఏసీ వేసుకుంటే కొంతసేపే చల్లదనం. పగలంతా ఇదే తీరు. సాయంత్రం సరదాగా నాలుగడుగులు బయటకు వేద్దామంటే భగ్గుమనే వేడిగాలులు... ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి దగ్గర వేసవి సెలవుల్ని ఏం ఎంజాయ్ చేస్తామంటూ.. సుదీర్ఘ ప్రయాణాలకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం వేసవి ట్రిప్‌లను చూస్తే కరోనా మునుపటి స్థితిని అధిగమించేలా కనిపిస్తున్నాయని ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ సంస్థ థామస్ కుక్ (ఇండియా), ఎస్ఓటీసీ ట్రావెల్ విడుదల చేసిన 'ఇండియా హాలిడే రిపోర్ట్?మే 2023' వెల్లడించింది.పర్యాటకుల ప్రయాణాలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో ఎక్కువ ఖర్చు పెట్టి విదేశాలకు కూడా వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మెజార్టీ ప్రజలు సులభంగా ప్రయాణ వీసాలు పొందే దేశాలకే మొగ్గు చూపుతున్నారు. భారతీయులకు అత్యంత ఇష్టమైన విదేశీ వేసవి విడిది ప్రాంతంగా యూరప్ అగ్రస్థానంలో నిలుస్తోంది. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ దేశాలు ప్రాధాన్య గమ్యస్థానాలుగా ఎక్కువ ట్రావెల్ బుకింగ్‌లు చేస్తున్నారు.సుదూర ప్రయాణాలకు సమయం వెచ్చించలేని పర్యాటకులు థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, దుబాయ్, అబుదాబి, ఒమన్‌తో పాటు మాల్దీవులు, మారిషస్ వంటి ద్వీపాల్లో సేద తీరేందుకు రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. కొత్తగా జపాన్, దక్షిణ కొరియా పర్యటనలపై కూడా ఆసక్తి పెరిగినట్లు సర్వే నివేదిక చెబుతోంది. విచిత్రంగా అమెరికా కంటే ట్రావెల్ బుకింగ్‌లలో 20 శాతం అధికంగా ఆస్ట్రేలియాకు ఉంటున్నాయి. వీసాలు పొందడంలో ఇబ్బందుల ఫలితంగా అమెరికాకు ట్రావెల్ బుకింగ్‌లలో తగ్గుదల కనిపిస్తోంది.

# ఏపీ వద్దు..తెలంగాణలో కలపండి


**ఖమ్మం:**

భద్రాచలం సరిహద్దులో ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని ఆ ఐదు గ్రామాల ప్రజలు గవర్నర్ తమిళిసైకి విజ్ఞప్తి చేశారు. భద్రాచలంలో గవర్నర్ తమిళిసై పర్యటన సందర్భంగా గిరిజనులతో ఆరోగ్య రక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తమపట్నం, ఎటపాక, పిచుకుల పాడు, కన్నాయి గూడెం, గుండాలకు చెందిన గిరిజనులు గవర్నర్‌ను కలిశారు. తాము ఏపీలో ఉంటూ ఇబ్బందులు పడుతు న్నామని తెలిపారు. జిల్లా కేంద్రం ఎక్కడో ఉందని అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అందువల్ల తమను తెలంగాణ ప్రాంతం అయిన భద్రాచలంలో కలపాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. వీరి సమస్యను విన్న గవర్నర్ పరిష్కారం కోసం తాను ప్రభుత్వాలతో మాట్లాడతు నానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వంతో కూడ చర్చిస్తానని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ఏడు ముంపు మండలాలను ఏపీలో కలిపారు. అయితే భద్రచలంను మాత్రం తెలంగాణలోనే ఉంచారు. భద్రాచలం సమీపంలో ఉండే విలీన గ్రామాలు ఏపీ కిందకు వస్తున్నాయి. అయితే అధికారులు తమను పట్టించుకోవడం లేదని.. తాము తెలంగాణలో కలుస్తామని ఆ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల గోదావరి వరదలు వచ్చినప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడంతో భద్రాచలం వేదికగా, తెలంగాణ-ఆంధ్రా సరిహద్దుల్లో ఐదు పంచాయతీలకు చెందిన ప్రజలు ధర్నా చేశారు. తమ గ్రామాలకు అర కిలోమీటర్ నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలోనే భద్రాచలం ఉందని, అందువల్ల తమను తెలంగాణలో కలిపితే సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ, ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రతినిధులు కూడా వచ్చి అక్కడి పరిస్థితులు తెలుసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే తమ గ్రామాల్ని తెలంగాణలో కలపాలని కోరుతున్నారు. తమను ఏపీలో కలపడం వల్ల గత ఎనిమిది సంవత్సరాల నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు భద్రాద్రికి సమీప ప్రాంత జిల్లా అని పేర్కొన్నారు. తమ గ్రామాలు ప్రస్తుతం అల్లూరి జిల్లాకు సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని అంతదూరం వెళ్లాలంటే తమ కష్టాలు అన్ని ఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి వరద ఎప్పుడు తమ ఊళ్లమీద పడుతుందోనని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఐదు గ్రామ పంచాయతీల్లో ఒకటైన యటపాకలో కరకట్ట పరిస్థితి మరింత ఆందోళన కరంగా ఉంది. మరోవైపు ఈ ఉద్యమం రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతోంది. అన్ని పార్టీలకు చెందిన నేతలు, ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఈ ఉద్యమానికి తెలంగాణకు చెందిన అఖిలపక్ష నేతలు కూడా మద్దతు తెలుపుతున్నారు.

# వివేకా కేసులో అజయ్ కల్లం వాంగ్మూలం

**కడప:**

వైఎస్ వివేకా హత్య తర్వాత, మరణ వార్త తెల్లవారు జామునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలిసిందనే కథనాల నేపథ్యంలో మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లాంను సిబిఐ విచారించింది. 2019లో ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో హత్య జరిగిన తెల్లారి అప్పటి ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్న సిఎం జగన్‌కు వివేకా మరణ వార్త అందరి కంటే ముందే తెలిసిందని కథనాలు వెలువడ్డాయి. 2019 మార్చి 15వ తేదీ తెల్లవారు జామున ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశంలో ఉండగా ముఖ్యమంత్రికి వివేకా మరణ వార్త తెలిసినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లాంను సిబిఐ విచారించినట్లు తెలుస్తోంది.వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలుస్తోంది. చిన్నాన్న వివేకానంద రెడ్డి గుండె పోటుతో మరణించారని ఆ రోజు జగన్ తమకు చెప్పినట్టు అజేయ కల్లాం అధికారులకు తెలిపారని సమాచారం. వివేకా మరణ వార్తను జగన్ 'ఏ సమయంలో చెప్పారని సీబీఐ అధికారులు ప్రశ్నించినపుడు 'సమయం ఖచ్చితంగా గుర్తులేదని, తెల్లవారుజామునే జరిగిందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. 2019 మార్చి



14వ తేదీ అర్ధరాత్రి తర్వాత తెల్లారితే 15వ తేదీ పులివెందులలో వివేకానంద రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు.అదే రోజు తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో జగన్ ఎన్నికల ప్రణాళికపై సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ భేటీలో మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం, జగన్ వ్యక్తిగత కార్యదర్శి కృష్ణమోహన్ రెడ్డి, ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సమావేశంలో జరుగుతుండగా ఫోన్ రావడంతో జగన్ పైఅంతస్తుకు వెళ్లారని, ఆ తర్వాత కిందికి వచ్చి 'చిన్నాన్న గుండెపోటుతో చనిపోయారని వారికి చెప్పినట్లు కొద్ది రోజుల క్రితం వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో జగన్‌తో 15వ తేదీ భేటీలో ఉన్న వారి నుంచి వివరాలు రాబట్టాలని సీబీఐ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.ఈ క్రమంలోనే మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లంను పిలిచి, ఆయన వాంగ్మూలం నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. వివేకా హత్య కేసులో జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిని సీబీఐ అధికారులు కడప సెంట్రల్ జైలులోని అతిథి గృహంలో ప్రశ్నించారు. తాజాగా అజేయ కల్లం వాంగ్మూలాన్నీ నమోదు చేసుకున్నారుమాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర రెడ్డిలను మంగళవారం ప్రశ్నించారు. వివేకా మరణించే ముందు రాసినట్టుగా చెబుతున్న లేఖ గురించే వారిద్దరి నుంచి ఎక్కువగా వివరాలు రాబట్టినట్టు తెలుస్తోంది. సీబీఐ నోటీసుల నేపథ్యంలో సునీత, రాజశేఖరరెడ్డి హైదరాబాద్ కోఠిలోని సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు.వివేకా హత్య తర్వాత జరిగిన పరిణామాలతోపాటు లేఖను ఎందుకు దాచిపెట్టాల్సి వచ్చింది?, తర్వాత పోలీసులకు అందించడం, వివేకా పీఏ కృష్ణారెడ్డికి హత్య జరిగిన రోజు ఎన్నిసార్లు ఫోన్లు చేశారు? ఆయన నుంచి ఎన్ని ఫోన్ కాల్స్ అందుకున్నారు? హత్య జరిగిన సమాచారం అందిన తర్వాత ఎవరెవరితో మాట్లాడారు? ఇలా పలు అంశాలపై సునీత, రాజశేఖరరెడ్డిలను సీబీఐ అధికారులు మరోమారు సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇద్దరి స్టేట్‌మెంట్లను సీబీఐ అధికారులు నమోదు చేశారు.

## మత్తు పదార్థాల గుట్టు రట్టు

**యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో మత్తు పదార్థాలను పోలీసులు పట్టుకున్నారు. సింథటిక్ డ్రగ్స్ అమ్ముతున్న ముఠా గుట్టు చౌటుప్పల్ పోలీసులు రట్టు చేసారు. వాటి విలువ 7, 92,000 వరకు ఉంటుందని డిసిపి రాజేష్ చంద్ర మీడియా సమావేశంలో తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఒకరిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. గోవా రాష్ట్రం ఈ మత్తు పదార్థాలను తీసుకువచ్చి జిల్లాలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నారని అయన అన్నారు.

## షర్మిలపై హైదరాబాద్‌లో కేసు

**హైదరాబాద్:**

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలి షర్మిలపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని దూషించారని 505(2), 504 సెక్షన్ల కింద కేసు రిజిస్టర్ చేశారు. టీఎస్‌పీఎస్సీ క్వశ్చన్ పేపర్ లీకేజీ కేసుపై ప్రెస్ మీట్ పెట్టిన షర్మిల బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ను అనవసరంగా దూషించారని ఆ పార్టీకి చెందిన నరేందర్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 16న ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## విషాదం మిగిల్చిన ఐపీఎల్

**హైదరాబాద్:**

క్రికెట్ అభిమానుల వినుల విందు అందిస్తోన్న ఐపీలో కొందరి జీవితాల్లో మాత్రం విషాదాన్ని నింపుతోంది. మ్యాచ్ చూసి ఎంజాయ్ చేయాల్సింది పోగా బెట్టింగ్‌ల పేరుతో ప్రాణాల మీదికే తెచ్చుకుంటున్నారు కొందరు. బెట్టింగ్ ఉచ్చులో ఇరుక్కుని అల్లాడిపోతున్నారు. తాజాగా ఇలాంటి ఓ దారుణ సంఘటన రంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోని గిరాయి గుట్ట తండా పరిధిలోని నార్లగూడ తండాలో అంగోతు ప్రకాష్ అనే యువకుడు ఐపీఎల్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు.బుధవారం రాత్రి జరిగిన ఢిల్లీ వర్సెస్ పంజాబ్ మ్యాచ్‌పై కూడా బెట్టింగ్ వేశాడు. పంజాబ్ గెలుస్తుందని ప్రకాష్ బెట్టింగ్ వేశాడు. అయితే ఈ మ్యా?చ్‌లో పంజాబ్ ఓటమి పాలు కావడం ప్రకాష్ ప్రాణాల మీదికి తెచ్చింది. బెట్టింగ్ డబ్బులు ఇవ్వాలని బలవంతం చేయడంతో.. డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఉన్న ప్రకాష్ ఏం చేయాలో తెలియక మానసిక ఒత్తిడికి గురై ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడుఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు హోరున విలపిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. యువత బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకొని ఇలా ప్రాణాలు వదలడం నిజంగా విచారకరం. ఉన్న ఒక్క జీవితాన్ని సంతోషంగా జీవించాలి కానీ ఇలా అద్యాంతరంగా ముగించడం తప్పుడు సరికాదు. తల్లిదండ్రులు, ఇంట్లో ఉండే పెద్దలు సైతం యువతపై ఓకన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఎమ్మార్వోకు స్వల్ప గాయాలు

**నెల్లూరు**

నెల్లూరు సమీపం లో చెముడు గుంట వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. చిల్లకూరు ఎమ్మార్వో అజ్మతుల్లా ఖాన్ ప్రయాణిస్తున్న కార్ ను లారీ ఢీ కొట్టింది. ఘటనలో ఎమ్మార్వోకు ప్రమాదం తృటిలో తప్పింది. అయనకు స్వల్ప గాయాలు అయ్యాయి. అయన ప్రాథమిక చికిత్స కోసం నెల్లూరు లో ఆసుపత్రికి వెళ్లారు.

## నిబంధనలుపాటించని ప్రైవేటు స్కూళ్లపై కొరడా

**నరసాపురం**

అధిక ఫీజులు వసూలు చేస్తూ, నిబంధనలు పాటించని . ప్రైవేట్ స్కూల్ లపై పశ్చిమగోదావరి జిల్లా అధికారి యంత్రాంగం కొరడా ఝులిపించేందుకు సన్నద్ధం అయ్యింది. జిల్లాలోని ప్రైవేటు స్కూలు స్కూలు వార్షిక నివేదిక ఆడిట్ రిపోర్టులను 15 రోజుల్లోపు సమర్పించాలని నరసాపురం సబ్ కలెక్టర్ సూర్య తేజ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో మాదిరిగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఈ ఏడాది స్కూల్ ప్రాంగణంలో పుస్తకాలు యూనిఫామ్ లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి స్కూల్లో ఏ క్లాస్ కు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారన్న వివరాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ నోటీస్ బోర్డ్ లో ఉంచాలన్నారు. ఆడిట్ రిపోర్టులు విద్యాశాఖకు సమర్పించని స్కూల్ లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

## నాటక రంగాన్ని పరిరక్షించుకోవాలి

**గూడూరు**

గూడూరు పట్టణంలో సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంఘిక నాటకాల పోటీల ముగింపు సందర్భంగా ముఖ్యఅతిథిగా సీనియర్ నటుడు భానుచందర్ గూడూరు పట్టణానికి విచ్చేశారు . ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భానుచందర్ మాట్లాడుతూ నాటక రంగాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని నాటక రంగం ద్వారా అనేక మంది కళాకారులు ప్రపంచానికి పరిచయం అవుతారని పేర్కొన్నారు ఈ క్రమంలో నాటకాలను ఆదరించే కళాభిమానులను గౌరవించుకోవడం మన సాంప్రదాయమని సూచించారు . సంస్కృతి సమ్మేళనం సంస్థ ఆధ్వర్యంలో 70 సంవత్సరాలుగా కళలను పరిరక్షిస్తూ నాటక పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు . తాను ప్రస్తుతం నాలుగు సినిమాల్లో నటిస్తున్నానని తెలిపారు

# ఓట్ల చీలికపైనే గులాబీ ఆశలు

**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 105 సీట్లలో గెలుపు ఖాయమని ప్రకటించారు. వందేళ్లలో చేయేలని అభివృద్ధి చేశామని.. చేసింది చెప్పుకుంటే చాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అత్యవసరంగా పిలిచిన నిర్వహించిన మీటింగ్‌లో చెప్పింది ఇదే. కేసీఆర్‌కు అంత నమ్మకం ఏమిటన్నది పార్టీ నేతలకూ అర్థం కాని విషయం. నిజానికి తెలంగాణలో ప్రస్తుతం అంత ఏకపక్ష వాతావరణం లేదని కానీ.. పార్టీ నేతల్లో నమ్మకం, ఆత్మ విశ్వాసం కల్పించడం.. నేతలు ఇతర పార్టీల వైపు చూడకుండా ఉండటానికి ఇలా చెప్పారని ఎక్కువ మంది భావిస్తున్నారు. 2018లో భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అప్పటికి తెలంగాణ సెంటిమెంట్ ఇంకా చల్లారలేదు. ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యంతో సెంటిమెంట్ ఓటర్ల ప్రధాన ఓటింగ్ అంశం అయింది. దానికి తోటు రైతు బంధు పథకాన్ని అప్పుడే తీసుకు వచ్చారు. నేరుగా రైతులు చెక్కులు ఇచ్చి.. డబ్బులు కళ్ల జూసేలా చేశారు. దీంతో ఆ ఓటు బ్యాంక్ కలిసి వచ్చింది. రెండో సారి తిరుగులేని విజయం వచ్చింది. మరి ఇప్పుడు అప్పట్లా పరిస్థితులు ఉన్నాయా అంటే లేవన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది. సహజ సిద్ద ఆయుధం అయిన సెంటిమెంట్ ను కేసీఆర్ వదిలేశారు. టీఆర్ఎస్ పార్టీనే ఏకంగా బీఆర్ఎస్ అని మార్చేశారు. బెంచ్ మార్క్ పథకాలు .. ఎక్కువ మందిలో అసంతృప్తికి కారణం అవుతున్నాయి. దళిత బంధు పథకం అందిన వారు మినహా ఇతరులు అసంతృప్తిగా ఉన్నారు. ఇతర వర్గాలు కూడా మాకేంటి అనుకుంటున్నాయన్న ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలపడలేదు. ఆ పార్టీలో వర్గ పోరాటం.. టీడీపీతో పొత్తు కారణంగా ఆ పార్టీ బలహీనం అయింది. అప్పట్లో బీజేపీ దీన స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ తో పాటు బీజేపీ కూడా పుంజుకున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చాలా గట్టిగా పోరాడుతోంది. ఓ వైపు రేవంత్.. మరో వైపు భట్టి విక్రమార్క పోదయాత్రలు చేస్తున్నారు. కర్ణాటకలో గెలుపు తర్వాత ఆర్థిక వనరులకు కూడా లోటు ఉండదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇక భారతీయ జనతా పార్టీ కూడా బలపడింది. గత ఎన్నికల్లో వేళ్ల మీద లెక్క పెట్టగలిగినన్ని చోట్ల మాత్రమే డిపాజిట్ తెచ్చుకుంది. కానీ ఈ సారి మాత్రం ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. వారిలో ఎంత బలవంతులు అనేది పక్కన పెడితే పెరిగిన బీజేపీ క్రేజ్ ను ఈ విషయం తెలియచేస్తుంది. ఎలా చూసినా ఇప్పుడు తెలంగాణలో రెండు జాతీయ పార్టీలు బలపడ్డాయనే. ముక్కోణపు పోటీలో మూడు పార్టీలూ హోరాహోరీగా తలపడితే మాత్రం కేసీఆర్ మూడో సారి విజయం సాధిస్తారనే అంచనా మొదటి నుంచి ఎన్నికల నిపుణులు వేస్తున్నారు. కానీ ఇటీవలి కాలంలో జరుగుతున్న ఎన్నికల ట్రెండ్ ను చూస్తే.. ప్రజలు రేసులో ఎన్ని పార్టీలు ఉన్నా.. ఒకే పార్టీ వైపు మొగ్గుతున్నారు. మొన్న పంజాబ్.. నిన్న కర్ణాటకలను చూస్తే ఇదే అర్థం అవుతుంది. తెలంగాణలో ప్రజలు కేసీఆర్ పదేళ్ల పాలన చాలు అనుకుంటే.. ఓ ప్రత్యామ్నాయం వైపు మొగ్గుతారు. ఆ ప్రత్యామ్నాయం బీజేపీ, కాంగ్రెస్ నా అన్నది తేల్చుకుంటారు. ఓట్లు చీలిపోతే మాత్రం బీఆర్ఎస్ కు అడ్వాంటేజ్ కనిపించవచ్చు ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉండాలా వద్దా అన్నది నిర్ణయించుకునేది ఈ ఆరు నెలల్లోనే. ఇప్పుడే అసలు రాజకీయం ప్రారంభమైందని అనుకోవచ్చు. కేసీఆర్ తమ నేతల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు వంద లెక్కలు చెబుతున్నారని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

# షర్మిలకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి పిలుపు?

**హైదరాబాద్ :**

అమెకు వరుసబెట్టి మిస్డ్ కాల్స్ ఇస్తోంది ఎవరు? ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడే ఎందుకు వస్తున్నాయి? వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు షర్మిల తాజా వ్యాఖ్యల ఆంతర్యం ఏంటి? ఆమె తమతో కలిసి వస్తే బాగుంటుందని కాంగ్రెస్ అధిష్టానం అనముకుంటోందా? లేక ఆమే? కాంగ్రెస్‌కు దగ్గర అవుతున్నారా? అసలేం జరుగుతోంది కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి నాకు మిస్డ్ కాల్స్ ఎక్కువయ్యాయని వైఎస్ షర్మిల ప్రకటించడం కలకలం రేపుతోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరి నుంచి ఆమెకు మిస్డ్‌కాల్స్ వస్తున్నాయి? ఎందుకలా చేస్తున్నారు? ఇప్పుడే ఆ తంతు ఎందుకు మొదలైందన్న చర్చ జరుగుతోంది. కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో హడావిడి చేస్తున్నారు షర్మిల. వైఎస్ కరిష్మా రాజకీయంగా తనకు ఉపయోగపడేలా పావులు కదుపుతున్నారు. అది ఎంత వరకు వర్కౌట్ అవుతుందో తెలియకున్నా? ఆమె మాత్రం తన ప్రయత్నం తాను చేస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది గానీ?ఇప్పుడు మిస్డ్ కాల్ మేటర్స్ కొత్త చర్చకు దారితీస్తున్నాయి. అసలేం జరిగిందంటే? .రెండు నెలల క్రితం ఢిల్లీలో కాంగ్రెస్ సుప్రీమ్ సోనియా గాంధీని కలిశారట షర్మిల. కర్నాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ఈ దిశగా పావులు కదిపారట. ఆయన స్వయంగా షర్మిలను వెంట పెట్టుకుని వెళ్లి.. సోనియా గాంధీని కలిసినట్టు సమాచారం. ఆ సమయంలోనే వైఎస్సార్ టీపీని? విలీనం చేయాలనే ప్రతిపాదనపై చర్చ జరిగినట్టు తెలిసింది. షర్మిల, డీకే శివకుమార్‌ల ఉమ్మడి ఎన్ఆర్ఐ మిత్రుడొకరి చొరవతో ఈ భేటీ జరిగిందనే టాక్ కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో డీకే కర్నాటక కాంగ్రెస్ కోసం చాలా కష్టపడ్డారని, వైఎస్ అంటే ఆయనకు అభిమానం అని తాజాగా కామెంట్ చేశారు షర్మిల. దీంతో చాలామందికి సోనియాతో భేటీ విషయం లో క్లారిటీ వచ్చిందని అంటున్నారు. షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయటానికే ఢిల్లీకి వెళ్లారా..? ఆ క్రమంలోనే మిస్డ్ కాల్స్ వస్తున్నాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు సంబంధం లేకుండానే? ఢిల్లీ నేతలు కాల్స్ చేస్తున్నారా..? అనే అనుమానం కూడా మొదలైందట. షర్మిల రాజకీయ వ్యవహారాలపై టి కాంగ్రెస్ నేతల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. తమను దెబ్బతీయడానికే? ఆమె పార్టీ పెట్టారన్న చర్చలు కూడా జరిగాయి. అలాంటి పరిస్థితిలో ఇక్కడి నేతల నుంచి ఆమెకు మిస్డ్ కాల్స్ వెళ్లే అవకాశం లేదు. అంటే డైరెక్ట్‌గా ఢిల్లీ నుంచి వస్తున్నాయా.. అన్న అనుమానాలు గాంధీభవన్‌లో పెరుగుతున్నాయి. తెలంగాణలో షర్మిల తమకు ఉపయోగపడతారని అధిష్టానం భావిస్తోందా? లేదంటే..వైఎస్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే ఖమ్మం జిల్లా నాయకుడు కూడా కలిసి వస్తారనే ఎత్తుగడ ఉందా? అన్న సందేహాలు కూడా తాజాగా వస్తున్నాయట. ఖమ్మం జిల్లాకు చెందిన ఆ నాయకుడు కాంగ్రెస్ అధిష్టానం ముందు పెట్టిన సీట్ల జాబితాలో సికింద్రాబాద్ అసెంబ్లీ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఆ సీటు షర్మిల కోసమేనా అన్న అనుమానాలు ఉన్నాయి. అక్కడ క్రిస్టియన్ ఓట్లు ఎక్కువ కాబట్టి గతంలో జయసుధ లాగా ఇప్పుడు షర్మిల చట్టసభలో అడుగుపెట్టాలనుకుంటున్నారా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. కానీ.. బయట జరుగుతున్న ప్రచారాన్ని షర్మిల కొట్టి పారేసినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో తేలాలంటే?మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే

# టీబీజేపీలో మళ్లీ మార్పు ముచ్చట్లు

**హైదరాబాద్ :**

కర్ణాటక ఎన్నికల ఫలితాల తరవాత తెలంగాణ బీజేపీలో అంతర్గతంగా ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మూడు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి కీలక నేతలతో సమావేశం అయ్యారు. అయితే ఈ విషయం చివరి వరకూ వెలుగులోకి రాలేదు. వెలుగులోకి వచ్చిన తర్వాత బీజేపీలో అంతర్గత రాజకీయం క్లైమాక్స్‌కు వచ్చిందన్న ప్రచారం ఆరంభమయింది. బండి సంజయ్‌ను కూడా హైకమాండ్ ఢిల్లీ పిలిపించిందన్న ప్రచారం ప్రారంభమయింది. అయితే బండి సంజయ్ మాత్రం తనకు ఢిల్లీ నుంచి ఎలాంటి పిలుపు రాలేదని స్పష్టం చేశారు. రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తి వేయాలని ఇప్పటికే కేంద్రనాయకత్వాన్ని కోరామన్నారు. బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడిగా ఉండటంపై ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన కొంత మంతి కీలక నేతలు అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కొంత కాలంగాసాగుతోంది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాల్సిందేనని నేతలు పట్టుబడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. హస్తినకు వెళ్లిన ఈటెల రాజేందర్ ఇదే విషయంపై చర్చించారని చెబుతున్నారు. మునుగోడు ఉపఎన్నిక తరవాత నుండే నేతలు అసంతృప్తితో ఉన్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. మునుగోడు ఉపఎన్నిక తరవాత పార్టీలో ఎవ్వరూ చేరకపోవడానికి కారణం కూడా అదేనని చెబుతున్నారు. పార్టీలో చేరినప్పుడు యాక్టివ్ గా కనిపించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. పార్టీకి, బండి సంజయ్ కి అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఈటల రాజేందర్, వివేక్ కూడా బండి సంజయ్ పై తీవ్ర అసహనంతో ఉన్నారని చెబుతున్నారు. బీఆర్ఎస్ సస్పెండ్ చేసిన పొంగులేటితో కూడా బీజేపీ చేరికల కమిటీ నేతలు చర్చలు జరిపారు. అప్పట్లో బండి సంజయ్.. ఇలా పొంగులేటితో చర్చలకు వెళ్తున్నట్లుగా తనకు తెలియదని ప్రకటించడం ఆ పార్టీలో విబేధాల్ని బయట పెట్టినట్లయింది కర్ణాటక ఎన్నికల తర్వాత పరిస్థితిని మరింత లోతుగా అధ్యయనం చేస్తున్న బీజేపీ హైకమాండ్.. తెలంగాణ విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నరు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో బండి సంజయ్‌కు మినహా ఇతర నేతలకు ఎక్కడా ప్రాధాన్యం లభించడం లేదని.. సీనియర్లు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే తమను పక్కన పెడుతున్నారని కొంత మంది ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇతర పార్టీల నుంచి వచ్చే సీనియర్ నేతలను చేర్చుకోవాలంటే వారికి కొంత భరోసా ఇవ్వాల్సి ఉంటుందని.. అందు కోసం కొన్ని చర్యలు తీసుకోవాలని ఈటల వంటి వాళ్లు ప్రతిపాదిస్తున్నట్లుగా చెబుతున్నారు. దీనిపై హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హై స్పీడ్ తో మెట్రో పనులు

**హైదరాబాద్:**

హైదరాబాద్ విమానాశ్రయం మెట్రో రైలు ప్రాజెక్టు పనుల్లో స్పీడ్ పెరిగింది. ప్రాజెక్ట్ అమలు చేయడానికి ఇఖఅ కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయడానికి తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ టెండర్‌లను ఆహ్వానించడంతో హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ వేగంగా ట్రాక్‌లోకి వచ్చింది. రాయదుర్గం, ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ స్టేషన్ మధ్య 31 కి.మీ కారిడార్‌ను కవర్ చేసే ప్రాజెక్ట్ కోసం టెండర్ కాంట్రాక్ట్ విలువ 5,688 కోట్లుగా అంచనా వేశారు. బిడ్ సమర్పణకు చివరి తేదీ జూలై 5గా ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీ కారిడార్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది . గతేడాది డిసెంబర్ 9న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎయిర్‌పోర్టు మెట్రోకు శంకుస్థాపన చేసినప్పటి నుంచి కీలక ప్రాజెక్టుకు సంబంధించిన పనులన్నీ శరవేగంగా సాగుతున్నాయి .ఇదిలా ఉంటే, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (ఊంఓఐ) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ..ఎలివేటెడ్ వయాడక్ట్, ట్రాక్ వర్క్, సిగ్నలింగ్ మరియు ఇతర అన్ని సివిల్ నిర్మాణాల రూపకల్పన, నిర్మాణానికి ఇది 5,688 కోట్ల అంచనా కాంట్రాక్ట్ విలువతో కూడిన సమగ్ర ఓపెన్ టెండర్‌గా ప్రకటించారు.అయితే, ఊంఓఐ పూర్తి చేసిన తాజా సర్వే ప్రకారం, మొత్తం 31 కిమీ కారిడార్‌లో ఒక భూగర్భ స్టేషన్ ఉంటుంది. ట్రాక్ ఎలివేటెడ్ భాగం 29.3 కి.మీ విస్తరించి ఉంటుంది. భూగర్భ విభాగం 1.7 కి.మీ. మొత్తం ఎయిర్‌పోర్ట్ మెట్రో నెట్‌వర్క్‌లో భూగర్భ స్టేషన్‌తో సహా తొమ్మిది స్టేషన్లు ఉంటాయి. బయోడైవర్సిటీ కూడలి, నానక్‌రాంగూడ కూడలి, నార్సింగి, అప్పా కూడలి, రాజేంద్రనగర్, శంషాబాద్ పట్టణం, విమానాశ్రయంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్)కు కొద్దిదూరంలో, విమానాశ్రయం టెర్మినల్‌లో భూగర్భ మెట్రోస్టేషన్‌తో ముగుస్తాయి.ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, పెగ్ మార్కింగ్, అలైన్‌మెంట్ ఫిక్సేషన్ తదితర ప్రాథమిక పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం భూసార పరీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రయాణీకుల భవిష్యత్తు అవసరాలు, ఇతర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, నెట్‌వర్క్‌లో నాలుగు అదనపు స్టేషన్ల నిర్మాణానికి నిబంధన ఉంచినట్లు ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వానికి 6,250 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇది టెండర్ ఖర్చు కంటే ఎక్కువ, ఇందులో కాంట్రాక్టర్ కాదు, ఊంఓఐ పరిధిలోకి వచ్చే ఆకస్మిక వ్యయం, మల్టీ-మోడల్ ఇంటిగ్రేషన్ ఉన్నాయని ఊంఓఐ ఓఆ వెల్లడించారు.

# నా స్టేట్ మెంట్ బయిటకు ఎలా వచ్చింది

**హైదరాబాద్,:**



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తన స్టేట్‌మెంట్ సీబీఐ నమోదు చేసిందని ఏపీ ప్రభుత్వ సలహాదారుల్లో ఒకరు అయిన అజేయకల్లాం ప్రకటించారు. కొన్ని మీడియాల్లో ఆయన స్టేట్ మెంట్ సీబీఐ నమోదు చేసిందని .. గుండెపోటుతో మరణించారని చెప్పారని.. సమయం మాత్రం గుర్తు లేదన్నారని ప్రచారం జరిగింది. దీంతో వివరణ ఇచ్చేందుకు ఆయన మీడియా సమావేశం పెట్టారు. సీబీఐకి తాను ఇచ్చిన స్టేట్‌మెంట్ ఎందుకు లీకయిందని ఆయన ప్రశ్నించారు. ఇదంతా రహస్య సమాచారం అని.. సీబీఐ దగ్గర నుంచి ఎలా లీక్ అయిందని ప్రశ్నించారు. వీటిని గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. మీడియాలో తాను వివేకానందరెడ్డి గండెపోటుతో చనిపోయారని జగన్ చెప్పినట్లుగా ప్రచారం జరుగుతోందని.. తన నోటి వెంట అసలు గుండెపోటు అనే మాటే రాలేదని ఆయన స్పష్టం చేశారు. తనపై వచ్చిన వార్తలపై అవసరం అయితే కోర్టుకు వెళ్తానని అజేయ కల్లాం హెచ్చరించారు. వివేకా మరణించిన విషయాన్ని జగనే తమకు చెప్పారని.. అయితే గుండెపోటుతో చనిపోయారనే విషయాన్ని చెప్పలేదన్నారు. గుండెపోటా.. మరో కారణమా అనే విషయం సీబీఐ తనను అడగలేదని అజేయకల్లాం స తెలిపారు. ఆ రోజు సమావేశంలో నలుగురు ఉన్నామని.. వారిలో తానొకడినన్నారు. ఏ సమయంలో జగన్ చెప్పాలో తనకు గుర్తు లేదని స్పష్టం చేశారు. తాను సీబీ?ఐకి ఇచ్చిన స్టేట్ మెంట్‌లో చెప్పకూడని అంశాలు ఎలా బయటకు వచ్చాయని.. ఆధారాలు లేకుండా మీడి?య ఎలా రాస్తుందని ప్రశ్నించారు. కాన్ఫిడెన్షియల్ సమాచారం అంటే సీబీఐ నుంచే రావాలిగా అని ఆయన ప్రశ్నించారు. తాను ఇచ్చిన స్టేట్మెంట్‌లో గుండెపోటుతో చనపోయారనే పదమే వాడలేదన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజున తెల్లవారుజామున సీఎం జగన్‌తో నలుగురు కీలక నేతలు మీటింగ్‌లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి వివేకా చనిపోయిన విషయం గురించి చెప్పారన్న ప్రచారం జరిగింది. గండెపోటుతో చనిపోయారని చెప్పారని ఓ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. అయితే ఆ మీడియా రిపోర్ట్స్ ఆధారంగా అందులో చెప్పిన నలుగుర్ని పిలిచి ప్రశ్నిస్తారని అనుకోలేదు. కానీ అనూహ్యం? అజేయకల్లాం స్టేట్ మెంట్ రికార్డు చేయడం .. అది కూడా మీడియాలో వచ్చిన తర్వాత నిజమని చెప్పడం సంచలనంగా మారిందని అనుకోవచ్చు. అజేయకల్లాం ఐఏఎస్ ఆఫీసర్. తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్వల్ప కాలం సీఎస్‌గా పని చేశారు. పదవీ కాలం పొడిగింపు లభించకపోవడంతో అసంతృప్తికి గురై వైఎస్ఆర్‌సీపీ పెద్దలకు దగ్గరయ్యారు. ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు సమావేశాలు పెట్టి విమర్శలు చేశారు. అవినీతి ఆరోపణలు గుప్పించారు. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం సలహాదారుగా నియమితులయ్యారు.

# ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు షరతులపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం

**న్యూఢిల్లీ:**



వివేకా హత్య కేసు నిందితుడు గంగి రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ రద్దుపై సీజేఐ చంద్రచూడ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బెయిల్‌ను రద్దు చేసి మళ్లీ ఫలానా రోజున విడుదల చేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఉత్తర్వులను పరిశీలించిన సీజేఐ ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వెకేషన్ బెంచ్‌కి బదిలీ చేసింది. సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ వచ్చేవారం విచారణ జరపనుంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ విషయమై వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గంగిరెడ్డి డీఫాల్ట్ బెయిల్ రద్దు చేస్తూ గత నెల 27న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, జూన్ 30లోగా దర్యాప్తును పూర్తి చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించిన నేపథ్యంలో....జూలై 1న గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని తన ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొంది. దీన్ని వ్యతిరేకిస్తూ సునీతారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. డీఫాల్ట్ బెయిల్‌పై బయట ఉన్నప్పుడు గంగిరెడ్డి తనకు కోర్టు ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేసిన ఉదంతాలు ఉన్నాయని తన పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. ఎర్రగంగిరెడ్డి ని ఫలానా తేదీన విడుదల చేయాలంటూ ఇచ్చిన తీర్పుపై వేకేషన్ బెంచ్ విచారణ జరిపి తీర్పు వెల్లడించనుంది. మరో వైపు అవినాష్ రెడ్డి కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన ఎక్కడికి వెళ్లాలనుకుంటే అక్కడి ఓ గంట ముందే చేరుకుంటున్నారు. కానీ అరెస్ట్ మాత్రం చేయడం లేదు. అరెస్ట్ చేయకుండా అవినాష్ రెడ్డి హైకోర్టు టు సుప్రీంకోర్టు తిరుగుతూనే ఉన్నారు. తాజాగా ఆయన బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అవినాష్ రెడ్డి తరపు లాయర్ నిరంజన్ రెడ్డి చీఫ్ జస్టిస్ ముందు అవినాష్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురించి మెన్షన్ చేశారు. అయితే విచారణకు తేదీ ఇవ్వడానికి చీఫ్ జస్టిస్ నిరాకరించారు. అత్యవసరం అయితే రాతపూర్వకంగా ఇవ్వాలని దాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ అత్యవసర పిటిషన్లను మాత్రమే విచారణ జరుపుతుంది. ఇప్పుడు అత్యవసరంగా విచారణ జరపాలని అవినాష్ రెడ్డి కోరే అవకాశం ఉంది.

# సేవా వజ్ర మరియు సేవా రత్న పురస్కారాలకు వాలంటీర్లు ఎంపిక

**తుగ్గలి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థలో భాగంగా ప్రజలకు సేవలందించిన ఉత్తమ వాలంటీర్లకు ప్రతి ఏటా పురస్కారాలను అందజేస్తుందని,ఇందులో భాగంగా తుగ్గలి మండలానికి సంబంధించి సేవ వజ్రా పురస్కారానికి ఒకరూ మరియు సేవా రత్న పురస్కారానికి ఐదు మంది వాలంటీర్లు ఎంపికైనట్లు తుగ్గలి ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.మండల పరిధిలోని గల ఎర్రగుడి గ్రామ సచివాలయానికి సంబంధించిన చిన్న కదిరప్ప కు సేవా వజ్ర పురస్కారం, అదేవిధంగా శభాష్ పురం గ్రామపంచాయతీకి చెందిన వాలంటీర్ మల్లికార్జున కు,తుగ్గలి గ్రామ సచివాలయానికి చెందిన వాలంటీర్ అశోక్ కు, జొన్నగిరి 2 సచివాలయానికి చెందిన వాలంటీర్ కవిత కు,ముక్కెళ్ల గ్రామ సచివాలయానికి చెందిన వాలంటీర్ రంగస్వామి కు,మారెళ్ళ గ్రామ సచివాలయానికి చెందిన వాలంటీర్ గురుస్వామి లకు సేవారత్న పురస్కారాలకు ఎంపికయ్యారని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.త్వరలో పత్తికొండ శాసన సభ్యురాలు కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ఎంపికైన వాలంటీర్లకు పురస్కారాలను అందజేస్తామని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.

ప్రజా తపన
prajathapana.com

# సిటీలో తగ్గనున్న రంబుల్ స్ట్రిప్స్ కు బ్రేక్

**హైదరాబాద్ :**

రోడ్లపై మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనదారులకు చెక్ పెట్టేందుకు, వేగ నిరోధానికి ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్(మినీ స్పీడ్ బ్రేకర్స్) వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే ఇదే విషయాన్నినగర ప్రజలు మున్సిపల్ మంత్రి కేటీఆర్ కు ట్విట్టర్ ద్వారా వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి కేటీఆర్.. రంబుల్ స్ట్రిప్స్ వల్ల ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఇటీవల అధికారులను ఆదేశించారు. దీంతో నగరంలో రంబుల్ స్ట్రిప్స్ వేయరాదని జీహెచ్ఎంసీ ఈఎస్సీ జియావుద్దీన్ ఎస్ఈ, ఈఈలకు సూచిస్తూ మెమో జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు రంబుల్ స్ట్రిప్స్ వేయరాదని వెల్లడించారు. పాదచారుల భద్రత కోసం జీబ్రా క్రాసింగ్స్, స్టాప్ లైన్ల వంటి పనులు యథావిధిగా చేయవచ్చని వివరించారు.నిజానికి రంబుల్ స్ట్రిప్స్ వల్ల వేగం తగ్గాలి. వాహనాల ప్రయాణం సాఫీగా సాగాలి. కానీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో.. ముఖ్యంగా టీఎస్ఐఐసీ పరిధిలోని ప్రాంతాల్లో వేసిన రంబుల్ స్ట్రిప్స్ నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక మందంతో వేశారు. రంబుల్ స్ట్రిప్స్ మధ్య ఉండాల్సిన నిర్ణీత గ్యాప్ కూడా లేకుండా అడ్డదిడ్డంగా నిర్మించారు. ఎత్తుకూడా ఎక్కువగా వేశారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్సీ) నిబంధనల మేరకు రంబుల్ స్ట్రిప్స్ మందం 5 మిల్లీ మీటర్లు కాగా.. నగరంలో కొన్ని చోట్ల 15 మిల్లీ నీటర్లు, అంతకంటే ఎక్కువ మందంతో నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 15 మిల్లీ మీటర్ల వరకు నిర్మించారు. ఇలా ఇష్టానుసారంగా వేశారు. దాంతో వాహనదారులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు నడుము, మెడలు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులతో మంత్రి కేటీఆర్ సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తూ.... వాటిని సరిదిద్దే చర్యలు తీసుకోవాల్సిందిగా జీహెచ్ఎంసీ కమిషనర్, ఈఎస్సీలను ఆదేశించారు. నిబంధనల మేరకు రంబుల్ స్ట్రిప్స్ రెండు లేయర్లుగా 5 మిల్లీ మీటర్ల మందం, 5 మిల్లీ మీటర్ల ఎత్తులో, 200 మిల్లీ మీటర్ల వెడల్పులో ఉండాలని, ఒక్కో స్ట్రిప్ మధ్య తగిన గ్యాప్ తో ఆరు స్ట్రిప్ లు ఉండాలని సంబంధిత ఉన్నతాధికారి తెలిపారు.

# దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించాలి

## రాములు నాయక్ పిలుపు

**హైదరాబాద్** :

దశాబ్ది ఉత్సవాల పేరుతో కేసీఆర్ మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి బయలుదేరుతున్నారని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మండిపడ్డారు. దశాబ్ది ఉత్సవాలని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఈ పది సంవత్సరాల్లో తెలంగాణ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం 1200 మంది బలిదానాలు చేశారన్నారు. కేసీఆర్ ఏం తీసుకొచ్చారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతారని ప్రశ్నించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తీసుకొచ్చావా?.. దళిత ముఖ్యమంత్రి ఇచ్చావా?.. నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చావా? అంటూ ఆయన నిలదీశారు.కేసీఆర్ వచ్చాక అన్నింటిలో అవినీతే అని ఆరోపించారు. కర్ణాటకలో 40 శాతం కమిషన్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణలో 500 శాతం అవినీతే అని... ఇక్కడి ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెపుతారని తెలిపారు. కేసీఆర్ గిరిజన యూనివర్సిటీని తీసుకురాలేకపోయారని, పోడు భూములకు పట్టాలివ్వలేదన్నారు. ప్రజలను డైవర్ట్ చేయడానికే దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులకు, మైనారిటీలకు రిజర్వేషన్లు పెంచినందుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. కర్ణాటకలో మంత్రులు ఏవిధంగా ఓడిపోయారో.. ఇక్కడ కూడా అదేవిధంగా ఓడిపోతారని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ వ్యాఖ్యలు చేశారు.

# ఫ్రీ సింబల్ కేటగిరిలో గ్లాసు

**విజయవాడ:**

భారత ఎన్నికల సంఘం జనసేన పార్టీకి గట్టి షాక్ ఇచ్చింది. జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసును ఫ్రీ సింబల్ జాబితాలో చేర్చింది. రాజకీయాల్లో గుర్తింపు రావాలంటే ఎన్నికల్లో గెలవాలి. ఒకవేళ ఓడిపోయినా ప్రజల్లో తగినంత మద్దతను ఓట్ల రూపంలో కూడగట్టుకోవాలి. అప్పుడే ఆ పార్టీకి ప్రాంతీయ లేదా జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. సినీ నటుడు పవన్ కల్యాణ్ పెట్టిన జనసేన పార్టీ గత సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్ర ప్రదేశ్ లో పోటీ చేసినా సీట్లు రాలేదు. గెలిచిన ఒక వ్యక్తి కూడా వైఎస్ఆర్సీపీకి మద్దుతు తెలిపారు. అయితే తగినన్ని ఓట్లతోపాటు సీట్లు కూడా దక్కించుకోలేక పోయిందా పార్టీ. దీంతో ఆ పార్టీ సింబల్ ను ఎన్నికల సంఘం ఫ్రీ సింబర్ కేటగిరీలో చేర్చింది. రాజకీయ పార్టీకి ప్రాంతీయ లేగా జాతీయ పార్టీగా గుర్తింపు ఇచ్చేందుకు.. కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని విషయాలను పరిగణలోకి తీసుకుంటుంది. అవేంటంటే.. ప్రాంతీయ పార్టీగా గుర్తింపు రావాలంటే ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఆరు శాతం, రెండు స్థానాలను దక్కించుకోవాలి. కానీ గత ఎన్నికల్లో జనసే పార్టీ వీటిని సాధించలేకపోయింది. ఓట్లు శాతం ఆరుగా ఉన్నప్పటికీ... కేవలం ఒకే ఒక్క సీటును కైవసం చేసుకుంది. మరో స్థానాన్ని కూడా జనసేన గెలుచుకొని ఉంటే ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందేది. 25 లోక్ సభ స్థానాల్లో ఒక్క ఎంపీ సీటును గెలుచుకున్నా ప్రాంతీయ పార్టీ హోదా దక్కేది. కానీ మరో స్థానం గెలుచుకోలేకపోయినందున జనసేన పార్టీ గుర్తును.. ఫ్రీ సింబల్ జాబితాలోకి చేర్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో అధికార పార్టీని గద్దె దింపడానికి విస్తృతంగా శ్రమిస్తున్న పవన్ కల్యాణ్ ఆశలపై ఈసీ నీళ్లు చల్లినట్లు అయింది. ఈసారి ఎలాగైనా మంచి సీట్లు సాధించాలన్న ప్లాన్‌తో రాజకీయం చేస్తున్న ఆయనకు ఎన్నికల సంఘం మాత్రం ఝలక్ ఇచ్చింది. జనసేన పార్టీ ప్రాంతీయ పార్టీగా గుర్తించకుండా గాజు గ్లాస్ గుర్తును ఫ్రీసింబల్ జాబితాలో చేర్చేసింది. దేశంలో ఉన్న 197కుపైగా ఉన్న చిన్న పార్టీల వాటిలో దీన్ని కలిపేసింది.ఒక్క జనసేన మాత్రమే కాదు దేశంలోని చాలా పార్టీలకు ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. ఏపీలో ప్రస్తుతం గుర్తింపు పొందిన పార్టీలు రెండుగానే చూపిస్తోంది. ఒకటి టీడీపీ, రెండోది వైఎస్ఆర్సీపీ. బీఆర్ఎస్, ఎంఐఎంతోపాటు టీడీపీ, వైసీపీని కూడా తెలంగాణ పార్టీల లిస్ట్‌లో చేర్చింది. ఈ పార్టీలకు మాత్రమే గతంలో కేటాయించిన గుర్తులను రిజర్వ్ చేయనున్నట్టు పేర్కొంది.

# ఆస్ట్రేలియా లో టీడీపీ సంబరాలు

**అడిలైడ్**



దివంగత ఎన్టీఆర్ శత జయంతి ని పురస్కరించుకొని దక్షిణ ఆస్ట్రేలియా లోని అడిలైడ్ నగరం లో స్థానిక ఎన్నారై టీడీపీ సెల్ ఆధ్వర్యంలో వినూత్నమైన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రెండు గంటలు పైగా అడిలైడ్ నగర వీధుల్లో ఉత్సాహం గా సైకిల్ ని తొక్కుతూ నగరం అంతా ప్రపంచం లో తెలుగువారి కి గుర్తింపు ని ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ విశిష్ట ను చాటి చెబుతూ.., తెలుగుదేశం జెండాలు చేతబూని,ఎన్టీఆర్, మరియు పార్టీ పాటలు తో జోహార్ ఎన్టీఆర్.. జై తెలుగుదేశం, జై బాలయ్య నినాదలు తో హోరుఎత్తించారు..

స్థానికులు (ఆస్ట్రేలియన్స్ )సైతం ర్యాలీ గా వెళుతున్న తెలుగుదేశం అభిమానులు ను చూస్తూ. ఉత్సాహం గా చేతులు ఊపుతూ, తమ ఫోన్లలో ఫోటో లు వీడియో లు తీసుకుంటూ ఉత్సాహం గా కనిపించారు.ఈ సందర్భంగా పలువురు ఎన్నారై టీడీపీ సభ్యులు మాట్లాడుతూ...మే 28న అడిలైడ్ నగరం లో శక పురుషుడి కి శత వసంతాలు పండుగ ఘనంగా నిర్వహించబోతున్నాం అని అందులో భాగంగా.. ఈ వినూత్నమైన సైకిల్ ని తొక్కుతూ శత జయంతి పండుగ ముఖ్య ఉద్దేశాన్ని తెలపడమే కాకుండా ఎన్టీఆర్ విశిష్టత, ఖ్యాతి స్థానికులు కు తెలియ చెప్పాలి అనే ఉద్దేశం తో నగరం లో ర్యాలీ చేప్పటాం అని తెలిపారు.. ఈ కార్యక్రమానికి మే 28 న నందమూరి కుటుంబసభ్యులు, బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి, చిన్న కుమార్తె తేజస్విని పాల్గొంటున్నారు అని కమిటీ సభ్యులు తెలిపారు.

# విశాఖలో కలకలం రేపిన మత్తు ఇంజక్షన్లు

**విశాఖపట్నం**

విశాఖ నగరంలో మరోసా రి మత్తు ఇంజక్షన్ల కలకలం రేపాయి. మత్తు ఇంజక్షన్లు భారీగా పట్టుబడ్డా యి. వారం రోజులు గడవక ముందే అదే ప్రాంతంలో 2,100 మత్తు ఇంజక్ష న్లు పట్టుబడ్డాయి. పెందుర్తి పరిధిలో మరో 100 ఇంజక్షన్లను సెబ్ అధికారు లు పట్టుకున్నారు. ఐదు రోజుల క్రితం అల్లీపురంలో 2,500 మత్తు ఇంజక్షన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మత్తు ఇంజక్షన్లకు అల్లిపురం కేంద్రంగా మారుతోంది. యువతను టార్గెట్ చేస్తూ లక్షల్లో వ్యాపారం నిర్వహిస్తున్నారు.సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ముగ్గురిని అదు పులోకి తీసుకున్నారు.ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో షాపు యజమాని మహేశ్వరరెడ్డి దగ్గర 35 మత్తు ఇంజక్ష న్లు, నీడిల్స్, గంజాయి, సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు.కోల్కత్తాకు చెందిన ఓ విద్యార్థి 50 ఇంజక్షన్ల బాక్సును రూ. 2వేలకు ఇస్తున్నట్లు తేలింది. అయితే మెడికల్ షాపు యజమాని 10వేలకుపైగా అమ్ముతు న్నట్లు పోలీసులు నిర్ధారించారు. విశాఖ అల్లిపురంలోని కొందరు ఈ డ్రగ్స్ దందా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# తెలంగాణలో భజరంగ్‌దళ్‌ను నిషేధించేందుకు కేసీఆర్ కుట్ర

**హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం బీజేపీ ఓబీసీ సమ్మేళనంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణలో భజరంగ్‌దళ్‌ను నిషేధించేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని అన్నారు. భజరంగ్‌దళ్‌ను నిషేధించడంలో కాంగ్రెస్‌తో కేసీఆర్ పోటీ పడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుట్రను తిప్పికొట్టటానికి హిందువులంతా ఏకంకావాలని పిలుపునిచ్చారు.బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ... బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇవ్వటం వెనుక కుట్ర దాగుందన్నారు. బీసీబంధు ప్రకటించటానికి ఇబ్బంది ఏంటో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో హైదరాబాద్ వేదికగా లక్షల మందితో బీసీ శంఖారావ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రామ రాజ్యం కోసం ఐదు నెలలు సమయం ఇవ్వాలని క్యాడర్‌కు బండి పిలుపునిచ్చారు. కేసీఆర్ క్యాబినెట్‌లో ముగ్గురు మాత్రమే బీసీ మంత్రులున్నారని... కేసీఆర్ కుటుంబానికి మాత్రం నాలుగు మంత్రి పదవులా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రిజర్వేషన్లు తగ్గించి బీసీల పొట్టకొట్టిందని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీని అవమానించిన మూర్ఖుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు.రూ.1600 కోట్లతో సచివాలయం కట్టిన కేసీఆర్... బీసీల ఆత్మగౌరవ భవనం ఎందుకు నిర్మించటంలేదని ప్రశ్నించారు. కర్ణాటక ఎన్నికల ప్రభావం తెలంగాణపై ఏ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. దళితబంధులో 30 శాతం కమిషన్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 30 శాతం కమిషన్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయన్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన తనకు రాష్ట్ర అధ్యక్షుడిగా బీజేపీ అవకాశం ఇచ్చిందని తెలిపారు. పాతబస్తీ ప్రజలకు రోడ్లు, ఉద్యోగాలు ఎందుకు ఇవ్వటం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు .

# అభివృద్ధిపై అధికార పక్షనేతలతో బహిరంగ చర్చ

**మేడ్చల్**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ చేపట్టిన హాత్ సే హాథ్ జోడో యాత్ర ఈరోజుతో 54 రోజులు కావడంతో ముగింపు సభ ను నియోజకవర్గ బూతు స్థాయి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.

అధికార పార్టీ నేతలకు అధికారులు తొత్తులుగా మారి ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై దృష్టి సాధించకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున జిహెచ్ఎంసిని ముట్టడిస్తామని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ తెలిపారు.

నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడికి రమ్మన్నా వస్తామని బహిరంగ చర్చకు సిద్ధమని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.

కెసిఆర్ సర్కార్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని, దళిత బంధువు పథకమును ప్రతి దళితునికి చెందే విధంగా చూడాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేస్తానని ఆడపడుచులకు గ్యాస్ 500 కే వచ్చే విధంగా, యువకులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి అని అన్నారు

# ప్రకాశంలో మండుతున్న ఎండలు

**ఒంగోలు**

ప్రకాశం జిల్లాలో ఎండలు రోజురోజుకూ నిప్పుల కొలిమిలా మండిపోతున్నాయి. మరో మూడు నాలుగు రోజులు ఎండలు ఇలానే ఉంటాయని అధికారులు చెపుతున్నారు.. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ప్రకాశం జిల్లాలో నమోదయ్యాయి. పగటిపూట అత్యధిక సమయం ఎక్కువ ప్రాంతాల్లో 43 నుంచి 46డిగ్రీలు నమోదై జిల్లా నిప్పులకొలిమిగా మారడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు. దీంతో అత్యధిక ప్రాంతాల్లో పగటిపూట ఒక రకంగా కరోనా నాటి లాక్డౌన్ పరిస్థితి రోడ్లపై కనిపిస్తోంది. సాధారణంగా జనం రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాల్లో పది గంటలకే వీధులు ఖాళీ అవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించింది. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన తొలి మూడు ప్రాంతాలు జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి...దీనితో రోజు రోజు కు వడ దెబ్బ బాధితులు పెరుగుతున్నారు..

వేడిగాలుల తీవ్రతతో వడదెబ్బ బాధితులు పెరుగుతున్నారు.జిల్లా లో ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారు..జిల్లా వ్యాప్తంగా 8 మంది వడదెబ్బకు మరణించారు.. జిల్లాలోని ఇంచుమించు మూడొంతుల ప్రాంతాల్లో సాయంత్రం ఆరు గంటలకు కూడా 40 నుంచి 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అర్ధరాత్రి సమ యంలో కూడా 36 నుంచి 38 డిగ్రీలు ఉంటున్నాయి. ఈ పరిస్థితితో అన్నివర్గాల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఒక వైపు చిరువ్యాపారులు, ఇంకో వైపు ఉపాధి కూలీల పరిస్థితి దారుణంగా ఉంటోంది. మరోవైపు వేడిగాలులతో పిల్లలు, వృద్ధులు తల్లడిల్లిపోతున్నారు...ఎండలకు ఉపశమన కేంద్రాలు ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు..

# కమలంతోనే కలిసుంటా

**హైదరాబాద్:**

కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మారిపోతున్నాయంటూ నాలుగు రోజులుగా తీవ్ర ప్రచారం జరుగుతోంది. ప్రధాన పార్టీల్లో మార్పులు, చేరికలు జరుగుతున్నాయంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ తరుణంలో ఇప్పటికే పార్టీ మారిన పలువురు కీలక నేతలు.. కాంగ్రెస్ వైపు చూస్తున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో పలు పార్టీల్లో అలజడి మొదలైంది. తెలంగాణలో హస్తం పార్టీ పుంజుకుంటుందా..? లేదా.. ఏదైనా మార్పు జరుగుతుందన్న విషయం పక్కన పెడితే.. ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మళ్లీ సొంత గూటికి వస్తున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే. ఈ ప్రచారంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫుల్ క్లారిటీ ఇచ్చారు.తాను జీజేపీకి రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీతోనే తన ప్రయాణమని.. కావాలనే తప్పుడు ప్రచారం చేసి.. తన అభిమానులను గజిబిజి చేస్తున్నారంటూ పేర్కొన్నారు. ఈ ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మొద్దంటూ కోమటిరెడ్డి సూచించారు. వచ్చే ఎన్నికల్లోనూ తాను బీజేపీ తరపున మునుగోడు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ట్వీట్ చేసి వెల్లడించారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన అనంతరం రాజగోపాల్ రెడ్డి మునుగోడులో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిపై ఓడిపోయిన విషయం తెలిసిందే.అయితే, కార్ణటకలో కాంగ్రెస్ గెలుపు అనంతరం ఆపార్టీలో చేరికలు పెరుగుతాయంటూ ప్రచారం జరుగుతోంది. జూపల్లి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలోకి చేరుతున్నారనేది ఇంకా వారు నిర్ణయం తీసుకోలేదు.

# 5త్వరలోనే కొడకండ్ల మినీ టెక్స్ టైల్ పార్క్ కు శంకుస్థాపన

**హైదరాబాద్**

సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు, మంత్రి కెటిఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్లలో ఏర్పాటు చేయనున్న మినీ టెక్స్ టైల్ పార్క్ కు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. సిరిసిల్ల మోడల్ లో గ్రౌండింగ్ కు ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి టిఎస్ ఐఐసీ ఎండి ఈవీ నర్సింహారెడ్డి, టెక్స్ టైల్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మిహిద్, టెక్స్ టైల్స్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, కొడకండ్ల సర్పంచ్ పసునూరి మధుసూదన్, సిందె రామోజీ, తదితరులతో హైదరాబాద్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన పేషీలో మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేనేత కార్మికులు కొడకండ్ల చుట్టు ముట్టు ప్రాంతాల్లో అధికంగా ఉండి, ముంబై, భీవండి, సూరత్ వంటి ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో వచ్చిన అభివృద్ధి, మార్పుల మాదిరిగానే, చేనేత రంగంలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకనుగుణంగా ఈ విషయాన్ని సీఎం కెసిఆర్ గారి దృష్టికి తీసుకెళ్ళిన వెంటనే కొడకండ్లలో మినీ టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు అనుమతిచ్చారని, అలాగే మంత్రి కెటిఆర్ సైతం సహకరించారని చెప్పారు.

# భానుడు భగభగలు

**హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగలు పెరిగిపోతున్నాయి. ఎండ వేడికి జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 దాటితేనే ఎండల తీవ్రత పెరిగిపోతుంది. ఇక మిట్ట మధ్యాహ్నం వేళలో బయటికి వెళ్లే పరిస్థితి కూడా లేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. సాయంత్రం 5 దాటినా వేడి తీవ్రత ఉంటుంది. ఎండ తీవ్రతను తట్టుకోలేక చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు. వడదెబ్బతో జనం పిట్టల్లా రాలుతున్నారు. రోజురోజుకు మృతుల సంఖ్య పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు అన్ని చోట్ల 44 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో అత్యధికంగా 46 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.వడదెబ్బతో ఇప్పటివరకూ ఏపీలో 13 మంది చనిపోగా.. తెలంగాణలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఎండల తీవ్రత వల్ల దినసరి కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పనులకు వెళుతున్న కూలీలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎండ తీవ్రత, వేడిగాల్పుల వల్ల కూలీలు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం బయటకు రాకపోవడమే బెటర్ అంటూ పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిన నేపథ్యంలో వడదెబ్బ ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు చెబుతున్నారు.. మిట్టమధ్యాహ్నం బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఏసీబీ కి దొరికిన అవినీతి తిమింగలం

**పల్నాడు**

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు వీఆర్వో ఏసీబీకి దొరికిపోయాడు. స్థానిక రైతు మానుకొండ నరసింహారావు మేనత్త పొలబోలు కోటమ్మ ,తక్కెళ్లపాటి వెంకాయమ్మ పొలం కొని దాఖలు డీడ్ చేసుకున్నది. ఆ పొలాన్ని ఆన్లైన్ చేయటానికి వి.ఆర్.ఓ వినోద్ లక్ష రూపాయలు లంచం అడిగాడు. 60 వేల రూపాయలు ఇచ్చినా, ఇంకా మిగిలిన నలభై వేల రూపాయలు ఇవ్వమని వి.ఆర్.ఓ డిమాండ్ చేసాడు.

# బీసీ డిక్లరేషన్ ను ప్రకటించిన బీజేపీ

**బీజేపీ అధికారంలోకి వస్తే... బీసీ జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు**

**రాష్ట్రంలోని బీసీ కమిషన్ కు రాజ్యాంగ హోదా**

**విదేశాల్లో చదివే బీసీ విద్యార్థులకు స్టాచ్యురేషన్ ప్రాతిపదికన ఆర్థిక సాయం**

**జూన్ లో లక్షలాది మందితో హైదరాబాద్ లో బీసీ గర్జన పేరిట బహిరంగ సభ**

**ఓబీసీ బీసీ సమ్మేళనంలో డాక్టర్ లక్ష్మణ్, బండి సంజయ్**

**హైదరాబాద్**

భారతీయ జనతా పార్టీ తెలంగాణలో బీసీ డిక్లరేషన్ ను ప్రకటించింది. అధికారంలోకి వస్తే బీసీ జనాభా ఆధారంగా బడ్జెట్ లో కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కోరల్లేని బీసీ కమిషన్ కు రాజ్యాంగ హోదా కల్పించి అన్ని అధికారాలు అప్పగిస్తామని పేర్కొంది. విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే బీసీ విద్యార్థులందరికీ పరిమితి లేకుండా స్టాచ్యురేషన్ (సంతృప్తస్థాయి) పద్ధతిలో అందరికీ ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్ద పీట వేస్తామని, ఎన్నికల్లో పోటీపడలేని, గెలవలేని బీసీల్లోని చిన్న కులాలకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసింది. ఈరోజు హైదరాబాద్ లోని నాగోల్ లో జరిగిన తెలంగాణ బీజేపీ ఓబీసీ సమ్మేళనం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సహా పెద్ద ఎత్తున బీసీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ బీసీ డిక్లరేషన్ ను ప్రవేశపెట్టగా బండి సంజయ్ ఆమోదించారు.



తొలుత లక్ష్మణ్ ప్రసంగించారు. రాష్ట్రంలోని బీసీ కమిషన్ కోరల్లేని కమిషన్... బీసీ జాబితాలో చేర్చే అధికారం లేదు.. బీజేపీ అధికారంలోకి వస్తే... రాష్ట్రంలోని బీసీ కమిషన్ ను రాజ్యాంగ హోదా కల్పిస్తాం... బీసీ సబ్ ప్లాన్ ను అమలు చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయిస్తాం. విదేశాల్లో చదివే బీసీ విద్యార్థులకు స్టాచ్యురేషన్ ప్రాతిపదికన ఆర్థిక సాయం చేస్తాం. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్ద పీట వేస్తాం. ఎన్నికల్లో గెలిచి రాలేని బీసీ కులాలకు ప్రాధాన్యతనిస్తామని అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక తొలి ప్రధానిగా చేసిన జవహార్ లాల్ నెహ్రూ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తే... బీసీల విషయంలో మాత్రం కమిషన్ వేసి రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని అంబేద్కర్ చెప్పినా నెహ్రూ వినలేదు... బీసీ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన నెహ్రూకు నిరసనగా... అంబేద్కర్ న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు... అప్పుడు దిగొచ్చి కాకా కళేకర్ కమిషన్ ను నియమించింది. రెండేళ్ల తరువాత నివేదిక ఇచ్చింది. అందులో 2399 బీసీ కులాల్లో 8 వందలకుపైగా కులాలు అత్యంత వెనుకబడ్డాయని నివేదించింది.

కానీ నెహ్రూ కనీసం ఆ నివేదికను బుట్టదాఖలు చేసి బీసీ వ్యతిరేక వైఖరిని అవలంబించారు. అంతేగాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలే తప్ప బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకూడదని... ఒకవేళ బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే... దేశ విభజనకు దారితీసే ప్రమాదం ఉందని తొలి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ అన్న రాష్ట్రాలకు లేఖ రాశారు (ఇదిగో లేఖ అంటూ చూపించారు. బీసీలారా.... కాంగ్రెస్ ను నిలదీయండి. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి. కాంగ్రెస్ ను దోషిగా నిలబెట్టాలనే ఉద్దేశంతోనే ఓబీసీ మోర్చా సమ్మేళం నిర్వహిస్తున్నాం.

మొరార్జీ ప్రధాని అయ్యాక బీపీ మండల్ కమిషన్ ను ఏర్పాటు చేసి నివేదిక తెప్పించుకున్నారు. 52 శాతం బీసీ జనాభా ఉంది. 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నివేదిక ఇస్తే... దానిని పార్లమెంట్ లో ఆమోదించేలోపు అంతర్గత కలహాలవల్ల ఆ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. ఆ తరువాత ప్రధానులుగా పనిచేసిన ఇందిరా గాంధ, రాజీవ్ గాంధీ లు ఆ ఊసే ఎత్తలేదు.

వీపీసింగ్ హయాంలో మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తూ ఆమోదిస్తే ఆ సిఫారసులకు వ్యతిరేకంగా రాజీవ్ గాంధీ రెండున్నర గంటలు మాట్లాడారు... ఇది పార్లమెంట్ రికార్డుల్లోనే ఈ విషయం ఇది. అంతేగాకుండా కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్ యూఐ బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కోర్టుకు ఎక్కింది. అయినా 9 మంది జడ్జీలతో కూడిన సుప్రీం ధర్మాసనం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని ప్రకటించింది. జాతీయ స్థాయిలో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేసి దానికి అనుగుణంగా బీసీ కులాల జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించింది.

గతంలో కేంద్ర సంస్థల్లో 2018 నుండి బీసీలకు 21 శాతం మేరకు విద్యలో అడ్మిషన్లు దక్కుతున్నాయి. గతంలో 14 శాతమే అమలు చేశారు.. ఏ సమాజికవర్గ జాబితాను బీసీలో చేర్చాలనే అంశంపై రాష్ట్రాలకే అధికారాన్ని అప్పగిస్తూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చిన ఘనత మోదీదే. ఆ స్వేచ్ఛను టీఆర్ఎస్ పూర్తిగా దుర్వినియోగం చేస్తోంది.మన రాష్ట్రంలో కేసీఆర్, ఆయన కుటుంబానికి మాత్రమే సామాజిక న్యాయం జరుగుతోంది. 54 శాతం బీసీలంటే అందులో ముగ్గురికి మాత్రమే కేసీఆర్ మంత్రి పదవులిచ్చారు. కానీ కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ పదవులిచ్చారు.

దేశంలో 40 సెంట్రల్ వర్శిటీలుంటే... మోదీ హయానికి ముందు గత 70 ఏళ్లుగా పట్టుమని పది మంది కూడా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా లేరంటే.... బీసీలను ఎంతగా అణగదొక్కారో అర్ధమవుతోంది. దీనిపై మోదీని కలిసి ఈ విషయాన్ని ప్రస్తావిస్తే... వివరాలు తెప్పించుకున్న ప్రధానమంత్రి 9 వేల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. తద్వారా అందులో 4 వేల మంది బీసీలు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించపడ్డారు.లోక్ సభలో 113 మంది బీసీకి చెందిన బీజేపీ ఎంపీలున్నారు. అత్యధిక ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీజేపీలోనే ఉన్నారు. కుటుంబ సమగ్ర సర్వే చేసినా బీసీ జనాభా 52 శాతం ఉందని తేలినా వాళ్లకు ఒరగబెట్టిందేమిలేదు. కుల వృత్తులను ధ్వంసం చేస్తున్నారు. బీసీ ఫెడరేషన్ కు నిధులే లేవు. బీసీల పేరుతో అధికారంలోకి వచ్చి కేసీఆర్ కుటుంబం కోసం పాటుపడుతున్నారే తప్ప బీసీలకు చేసిందేమీ లేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తెలంగాణలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన కేసీఆర్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా 23 శాతానికి కుదించి బీసీలు ప్రజా ప్రతినిధుల కాకుండా అన్యాయం చేశారు. కేసీఆర్ బీసీ ద్రోహి అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఎంబీసీల పేరుతో కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి రూ.2500 కోట్లు కేటాయించినా... ఖర్చు చేసింది మాత్రమే రూ.7 కోట్లే... అయినా బీసీ ఎమ్మెల్యేలు కేసీఆర్ కు బానిసలుగా ఉన్నారు? హిందూ బీసీలుగా పుట్టడమే పాపమా? బీసీ డిక్లరేషన్ ను తొక్కిపెట్టిన మహానుభావుడు కేసీఆర్. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే... జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీలకు అన్నింట్లో వాటా ఇస్తాం. ఈ మేరకు తెలంగాణ డిక్లరేషన్ ను ప్రవేశపెట్టబోతున్నాం.

బీసీ గణనపై కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఏమైంది? వాటిని ఎందుకు బయటపెట్టలేదు. ఆ వివరాలన్నీ బయటకు వస్తే బీసీలకు పదవులు ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే తొక్కిపెడుతున్నారు. అయినా సిగ్గు లేకుండా కేంద్రం బీసీ గణన చేయాలంటూ తీర్మానం చేయడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనం. బీసీ గణనపై అధ్యయనం చేసి శాస్త్రీయంగా నిర్వహించాలన్నదే బీజేపీ విధానం. బీసీ గణన నిర్వహించే అధికారం రాష్ట్రాలకు కేంద్రం అప్పగించింది. అయినా కేసీఆర్ ఎందుకు నిర్వహించడం లేదు? తెలంగాణలో బీసీలను కేసీఆర్ అణగదొక్కుతున్నారు. మోదీ ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేస్తోంది. అందుకే తెలంగాణలో మార్పు రావాలి. బీసీల మద్దతు కూడగట్టుకుని తెలంగాణలో అధికారంలోకి వస్తాం. అందుకోసం 130 కులాలను ఏకం చేస్తాం... పల్లెపల్లెకూ బీసీ– ఇంటింటికీ బీజేపీ పేరుతో ఈ విషయాలన్నీ ప్రచారం చేస్తాం... అతి త్వరలో లక్షలాది మందితో బీసీ గర్జన నిర్వహించి కాంగ్రెస్, టీఆర్ఎస్ లను బీసీ దోషిగా నిలబెడతామని అన్నారు.

## పేపర్ లీకేజ్ కేసులో మరో నలుగురు అరెస్ట్

**హైదరాబాద్ :**

టీఎస్ పీఎస్సీ పేపర్ లీక్)కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈకేసులో అరెస్టుల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. నిందితుల జాబితా అంతకంతకు పెరుగుతోంది. ఈకేసులో తాజాగా సిట్ అధికారులు మరో నలుగుర్ని అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. దీంతో పేపర్ లీక్ కేసులో అరెస్టైన పాత్రధారులు, సూత్రధారుల సంఖ్య 35కి చేరుకుంది. బుధవారం అరెస్ట్ చేసిన వాళ్లలో ఈ పేపర్ లీక్ స్కామ్ కేసులో సూత్రధారిగా ఉన్నటువంటి రాజశేఖర్ భార్యతో పాటు మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు సిట్ అధికారులు.వాళ్లను విచారించి కీలక సమాచారాన్ని రాబట్టినట్లుగా తెలుస్తోంది.టీఎస్ పీఎస్సీ పేపర్ లీక్ కేసులో అవినీతి డొంక అనకొండ మాదిరిగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఈకుంభకోణంలో సిట్ అధికారులు వేగంగా విచారణ జరుపుతున్నారు. తాజాగా కేసులో కీలక సూత్రధారిగా ఉన్నటువంటి రాజశేఖర్ భార్యతో పాటు మరో ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. పేపర్ లీక్ కుంభకోణంలో ప్రమోయం ఉన్నవారిలో 35మంది అరెస్ట్ అయ్యారు. ఇప్పటికే అరెస్ట్ చేసిన వాళ్లను కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్న సిట్ అధికారులు వాళ్లిస్తున్న సమాచారం ప్రకారం కొత్త వాళ్లను ..ఈవ్యవహారంతో సంబంధాలు ఉన్న వాళ్లను అరెస్ట్ చేస్తున్నారు. అయితే పేపర్ లీక్ స్కామ్లో మరికొందరు ఉన్నట్లుగా సిట్ భావిస్తోంది. వాళ్ల పేర్లను బయటకులాగి ..కటకటాల వెనక్కి పంపేందుకు విచారణ వేగవంతం చేస్తోంది.తిలా పాపం..తలా పిరికెడు అన్నట్లుగా ఉంది టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కుంభకోణం. ఇప్పటి వరకు 35మందిని అరెస్ట్ చేశారు అధికారులు. ముఖ్యంగా కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే బుధవారం అరెస్ట్ చేసిన నలుగురి ప్రశ్నిస్తున్నారు. బుధవారం అరెస్ట్ చేసిన నలుగురి కంటే ముందు ముగ్గురు కీలక సూత్రధారుల్ని అరెస్ట్ చేశారు. క్రాంతి, రవితేజ, శశిధర్ అనే ముగ్గుర్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం జరిగింది.ఏఈఈ ప్రశ్నపత్రాన్ని క్రాంతి, శశిధర్, మురళీధరన్ వద్ద కొనుగోలు చేసినట్లుగా తేల్చారు. అలాగే డీఈవో ప్రశ్నపత్రాన్ని సాయిలౌకిక్ వద్ద రవితేజ కొనుగోలు చేసినట్లుగా సిట్ అధికారులు తమ విచారణలో రాబట్టారు. 9రోజుల క్రితం అనగా మే9వ తేదిన కూడా నలుగుర్ని అరెస్ట్ చేశారు సిట్ అధికారులు. వాళ్లు కూడా ఏఈ, ఏఈఈ ప్రశ్నపత్రాలను కొనుగోలు చేసినట్లుగా దర్యాప్తులో తేల్చారు. 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈకేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కర్ని బయటకు లాగేందుకు సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా అందర్ని అరెస్ట్ చేస్తున్నారు.

## 19 న జేఎన్టీయూ లో డ్రగ్ ఇన్స్పెక్టర్ పోస్టు కోసం సీబీఆర్టీ పరీక్ష

**జగిత్యాల,**

సీబీఆర్టీ (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్ మెంట్ టెస్ట్) పద్ధతిలో ఎగ్జామ్‌పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు రావాలిజిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషతెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సీబీఆర్టీ (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్) పద్ధతిలో ఈ నెల19 న జగిత్యాల జిల్లాలోని కొండగట్టు జేఎన్టీయూ లో డ్రగ్ ఇన్స్పెక్టర్ పోస్ట్ కోసం సీబీఆర్టీ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారని మరియు తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు రెండు విడతలుగా జరుగుతుందని ఆమె తెలిపారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ పోస్ట్ కోసం సీబీఆర్టీ పరీక్ష కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు.అభ్యర్థులు ఉదయం పూట జరిగే పరీక్షకు ఉదయం 09.30 గంటల వరకు , మధ్యహ్నం పూట జరిగే పరీక్షకు మధ్యాహ్నం 02.00 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి వచ్చి ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు

# వాలంటీర్లకు వందనం

**వరసగా మూడో ఏడాది ... ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డుల ప్రధానం**

**శుక్రవారం విజయవాడ ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్**

**అమరావతి**

తొలి కోడి కూయకముందే, తూర్పు తెలవారకముందే, ఎండైనా, వానైనా. ఆదివారం అయినా, పండగైనా, సెలవు రోజైనా ప్రతి నెలా మొదటి తారీఖునే ఠంఛన్ గా మీ గడప వద్దకు వచ్చి, మీ తలుపు తట్టి, చిక్కటి చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించి వైఎస్ జగన్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లను అవ్వాతాతలకు అందించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించడం, అర్హులందరికీ లబ్ధి అందేలా చేయి పట్టుకొని నడిపిస్తూ, ప్రతి 50 ఇళ్లకు ఒక బిడ్డగా ఉంటూ వైఎస్ జగన్ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలబడి సేవాభావంతో లంచాలు, వివక్షకు తావులేకుండా సేవలందిస్తున్న వాలంటీర్ చెల్లెమ్మలకు, వాలంటీర్ తమ్ముళ్లకు సెల్యూట్ చేస్తూ వారి సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా అందిస్తున్న చిరు సత్కారం..

అవినీతికి తావులేకపోవడం, సచ్ఛీలత, ఇంటింటి సర్వే, పెన్షన్ల పంపిణీ, హాజరు, యాప్ల వినియోగం, నవరత్నాల అమల్లో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, పెన్షన్ కార్డు, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయించడం తదితర అంశాల్లో పనితీరు ప్రామాణికంగా అవార్డులకు ఎంపిక

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,33,719 మందికి రూ. 243.34 కోట్ల నగదు పురస్కారాలు.

నేడు అందిస్తున్న రూ. 243.34 కోట్లతో కలిపి ఇప్పటివరకు వాలంటీర్లకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన నగదు పురస్కారాల మొత్తం రూ. 705.68 కోట్లు

గ్రామ/వార్డు వాలంటీర్లు తమ పరిధిలోని 50/100 కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నందుకు... గ్రామ/ వార్డు సచివాలయాలకు, ప్రజలకు మధ్య మంచి సంధానుకర్తలుగా వ్యవహరించినందుకు...

అనినీతి, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్దిదారులను గుర్తించడంలో సహాయకారిగా వ్యవహరించినందుకు...



కోడి కూయకముందే ఇంటి తలుపు తట్టి, చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెప్పి మరీ ఠంచన్ గా పింఛన్లు, ప్రతి నెల ఒకటో తారీఖునే అందిస్తున్నందుకు...

మీరు చేస్తున్నది ప్రజలందరికి మంచి చేసే గొప్ప సేవ... శభాష్ వాలంటీర్

పెన్షన్లతో పాటు రేషన్ డోర్ డెలివరీ, బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఇళ్ళ పట్టాలతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులందరికీ నిర్దిష్ట కాల పరిమితిలో అందేందుకు సహాయపడుతున్నందుకు..

వరదలు, విపత్తులు, ప్రమాదాల సమయంలో సహాయ కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను ఆదుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరియు 'దిశ' వంటి ముఖ్యమైన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు...

జగనన్న సంక్షేమ క్యాలెండర్ను అనుసరించి ఎప్పుడు ఏ పథకం అమలవుతుందో ప్రజల దగ్గరకు వెళ్లి వివరించి అవసరమైతే దగ్గరుండి దరఖాస్తు చేయించే సేవా సైనికులైనందుకు..

**....సేవా సైన్యానికి సలాం..**

మే 19 వ తారీఖు నుండి అన్ని నియోజకవర్గాల్లో పండగ వాతావరణంలో వాలంటీర్లకు అవార్డుల ప్రదానం మొదలు.

కనీసం సంవత్సర కాలంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న వాలంటీర్లకు, వారు అందించిన సేవల ఆధారంగా 3 కేటగిరీల్లో పురస్కారాలు..

సేవా వజ్ర

సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్తో పాటు రూ. 30,000 నగదు బహుమతి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మొదటి ఐదుగురు వాలంటీర్లకు 175 నియోజకవర్గాల్లో 875 మంది వాలంటీర్లకు సేవా వజ్ర పురస్కారాల ప్రధానం


**సేవా రత్న**


సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్తో పాటు రూ. 20,000 నగదు బహుమతి. ప్రతి మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు చొప్పున, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 10 మంది చొప్పున టాప్ 1 శాతం ర్యాంకు సాధించిన వాలంటీర్లకు, మొత్తంగా 4,220 మందికి సేవా రత్న పురస్కారాల ప్రధానం

**సేవా మిత్ర**

సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్తో పాటు రూ. 10,000 నగదు బహుమతి. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది పాటు ఎటువంటి ఫిర్యాదులు, వివాదాలు లేకుండా పనిచేసిన వాలంటీర్లకు 2,28,624 మందికి సేవా మిత్ర పురస్కారాల ప్రధానం







Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950